# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 118 | విశాఖపట్నం | 29-1-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 118 | VISAKHAPATNAM | 29-1-2026 THURSDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902




## జగన్‌పై మంత్రి లోకేశ్ ఫైర్

2లో

విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం

## అజిత్ పవార్ మృతి



2లో



## గుండెపోటు రావడానికి గల కారణాలు?

6లో



# హోం మంత్రి అనితకు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు సెగ

- సొంత పార్టీ నేతలు విమర్శలు
- అనకాపల్లి ఉత్సవ్ పై సమాచారం లేదన్న పిలా గోవింద సత్యనారాయణ
- చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలకు నో ఇన్ఫర్మేషన్
- లీడర్లు సమన్వయంతో మంత్రి పూర్తిగా విఫలమనే ప్రచారం
- చంద్రబాబు వద్ద తేల్చుకుంటాను అన్న అనకాపల్లి టీడీపీ ఇన్చార్జి పీలా
- బిజీ షెడ్యూల్ తో మంత్రి టూర్లు
- అనకాపల్లి టీడీపీ నేతలు నుంచి విమర్శలు
- బాబు వద్దకు చేరునున్న పంచాయితీ
- ఆరని పంచాయతీ, వాట్ నెక్స్ట్ అంటున్న ఎమ్మెల్యేలు!!

**అనకాపల్లి, పతాకం న్యూస్:** హోంమంత్రి అనిత పై అసమ్మతి సెగలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని చెప్పవచ్చు, మొన్న విజయనగరం జిల్లా పైడితల్లి అమ్మవారు సాక్షిగా జిల్లా మంత్రి శ్రీనివాసు, ఇన్చార్జి మంత్రి అనితకి పడలేని విషయం తెలిసిందే.

అనకాపల్లి ఉత్సవ సందర్భంగా జిల్లా ఏకైక మంత్రికి సొంత పార్టీ నేతలు ఆమెపై బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు తాజాగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హోంమంత్రి తీరుపై మండి పడ్డారు.

సీఎం వద్దే తేల్చుకుంటానని బహిరంగంగానే ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలానే కొనసాగితే మంత్రి అనితకు ఇబ్బందిలేనిని అభిప్రాయాలను రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. పాయకరావుపేట నుంచి రెండోసారి ఎమ్మెల్యే గా గెలుపొందిన అనితకు అనూహ్యంగా హోం మంత్రి పదవి దక్కింది. అప్పటివరకు ఆమె పట్ల కూటమి నాయకులకు కొంత సానుభూతి ఉండేది.టిడిపి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆమె ఇబ్బందులు పడ్డారు ఈ సానుభూతి అనిత పై ఉంది అయితే మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనిత తీరుపై సొంత పార్టీ శ్రేణుల నుంచి విమర్శలు వస్తున్నాయి.మంత్రిగా బాధ్యతులు చేపట్టిన తర్వాత అనకాపల్లి జిల్లా వ్యవహారాలను సక్రమంగా చూడటం లేదని పార్టీ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది. ఒకపక్క హోం మంత్రి అనిత రాష్ట్రవ్యాప్తంగా బిజీబిజీ షెడ్యూల్లో గడుపుతున్నారని టాక్ కూడా మరోపక్క వినిపిస్తుంది. రాజకీయాల్లో ఎప్పుడూ మంత్రిగా శాశ్వతం కాదని పార్టీ సీనియర్ నాయకులు,ఎమ్మెల్యేలు అన్నట్టు టాక్.

రాజధానిలో భూములు లేని పేదలు, అనాథలకు పించన్లు..

# 35 అజెండా అంశాలకు కేబినెట్ ఆమోదం



**అమరావతి, పతాకం న్యూస్:** సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. 35 అజెండా అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పిడుగురాళ్ల వైద్యకళాశాలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎస్వీ వర్సిటీ పరిధిలోని 33 ఎకరాల భూమిని వ్యవసాయ మార్కెట్ కమిటీకి పలమనేరులో లైవ్‌స్టాక్ రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అర్జున్ అవార్డు గ్రహీత జ్యోతి యర్రాజికి విశాఖలో 500 చదరపు గజాల స్థలం, డిగ్రీ తర్వాత గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదించింది. ఏపీ టిడ్కోకు హడ్కో నుంచి 4,451 కోట్లు ప్రభుత్వ రుణ గ్యారెంటీని కేబినెట్ ఆమోదించింది. రాజధాని అమరావతి పరిధిలో వీధిపోటు భూములు పొందిన రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయిం చేందుకు ఆమోదం తెలిపింది. అమరావతి పరిధిలో భూములు లేని పేదలకు, అనాథ పిల్లలకు పింఛన్ల మంజూరును ఆమో దించింది. టీటీడీ పరిధిలో పలు పోస్టుల అప్‌గ్రేడ్‌కు, పలు సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది. అల్లూరి జిల్లా నందకోటలో పర్యాటక శాఖ ఫైవ్‌స్టార్ రిసార్ట్, కన్వెన్షన్ సెంటర్, థీమ్ పార్కు ఏర్పాటుకు భూకేటాయింపులకు కేబినెట్ ఆమో దించింది. పలు జలవనరుల ప్రాజెక్టులకు ఆర్థిక అనుమతులకు ఆమోదం తెలిపింది. ఇంధనశాఖలో పలు పరిపాలన అనుమతు లకు ఆమోదించింది. తిరుపతి, విశాఖపట్నంలో (తరువాయి 2వ పేజీలో)

## వెలిగొండ ప్రాజెక్టుపై దుష్ప్రచారం తగదు: నిమ్మల



**అమరావతి, పతాకం న్యూస్:** వెలిగొండ ప్రాజెక్టుపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారానికి సాక్ష్యాలతో సహా కౌంటర్ ఇచ్చారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం మీడియాతో మాట్లాడిన మంత్రి.. వెలిగొండ ప్రాజెక్టులో ఇప్పటికీ జరుగుతున్న పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వెలి గొండ నిర్మాణం పూర్తి అయిపోయిం దని.. జగన్ మోహన్ రెడ్డి ఆ ప్రాజెక్టును ఎప్పుడో జాతికి అంకితం చేశారంటూ వైసీపీ చేస్తున్న విమర్శలపై మంత్రి తీవ్రం గా స్పందించారు. ఇంకా వేల కోట్ల రూపా యల పనులు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తోందని ఫొటోలు, వీడియోలతో నిమ్మల వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తి కాకుండానే పరదాల మాటున జగన్ మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు వెలిగొండను జాతికి అంకితం చేసినట్టు డ్రామాలాడారని విమర్శలు గుప్పించారు.

జిల్లా కలెక్టర్,ఎస్పీ ఆఫీసులను

# అనకాపల్లి పట్టణంలో పెట్టాలి

సీఎం చంద్రబాబుకి దాడి రత్నాకర్ లేఖ



**అనకాపల్లి, పతాకం న్యూస్:** నాలుగు సంవత్సరముల క్రిందట ఏర్పడిన జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ కార్యాలయములు సామాన్య ప్రజలకు,ఉద్యోగులకు,రైతులకు అందుబా టులో లేవు. రవాణా సౌకర్యములు, భోజన పలహార శాలలు, పిటీషను దారులకు ముఖ్యంగా మహిళలకు సదుపాయాలు ఏమి లేవు.అనకాపల్లి మున్సిపల్ ఆఫీసు కార్యా లయం యొక్క రెండున్నర ఏకరముల స్థలంలో జీవియంసి రెండు అంతస్తుల పార్కింగు కాక, ఏడు అంతస్తుల పరిపాలన భవనమును నిర్మించి, కలెక్టర్ కార్యాలయమును, జీవీయంసి ప్రధాన కమిషనర్ కేంప్ మరియు యితర ప్రాంతీయ కార్యాలయములను నిర్మించుటకు చర్యలు తీసుకోవలసిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు దాడి రత్నాకర్ లేఖ రాసారు. రెండు అంతస్తుల పార్కింగ్ స్థలం,ఏడు అంతస్థులకు సుమారు లక్షన్నర చదరపు అడుగుల నిర్మిత స్థలం లభిస్తుందని (తరువాయి 3వ పేజీలో)

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## శక్తి

77వ రిపబ్లిక్ దినోత్సవం రోజున మన సైనిక బలగాల సత్తాను ప్రదర్శించారు. న్యూఢిల్లీ కర్తవ్య పథ్‌లో జరిపిన కవాతును చూసి దేశం యావత్ పులకించిపోయింది. ప్రతి దేశం రిపబ్లిక్ దినోత్సవం లేదా స్వాతంత్ర్య దినోత్సవం, ఇతర ముఖ్య ఉదంతాలు ఉంటే ఆ రోజున ఇలాంటి విన్యాసాలను ప్రదర్శించి తమ శక్తి ఇదని ప్రపంచానికి చాటుతున్నాయి. ఈ సందర్భంగా కొందరు విశ్లేషకులు, కొన్ని టీవీ ఛానళ్లు ప్రసారం చేసిన కథనాలు, విశ్లేషణల్లో అతిశయోక్తులు దొర్లాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ మిలిటరీ బలం బలగాల గురించి పరిమితంగా అయినా ఒక్కసారి అవలోకనం చేసుకోవటం అవసరం. మన దేశం 1,500 కిలోమీటర్ల దూరంలోని యుద్ధ నౌకలను దెబ్బ తీసే సామర్థ్యంగల దీర్ఘశ్రేణి క్షిపణి (ఎల్.ఆర్-ఎ.ఎస్.హెచ్.ఎం)తో చైనా, అమెరికా నౌకలను కూడా దెబ్బ తీయగలదని ఒక విశ్లేషకుడు చెప్పారు. అది నిజమే, ఎప్పుడు యుద్ధం వచ్చినపుడు, ఎదుటి వారు దాడికి దిగనంతవరకు మాత్రమే. హిందూ మహాసముద్ర అంతర్జాతీయ జలాల్లో ప్రవేశించిన ఏ దేశ నౌకనైనా వెంటనే పేల్చివేయటానికి ఉండదు. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమంటే అలాంటి క్షిపణులను తయారు చేసే దేశంగా మనం ఇటీవలనే సామర్థ్యం సంపాదించుకున్నాం. మన కంటే బలమైన మిలిటరీ శక్తి ఉన్న విషయాన్ని దాచి ప్రపంచంలో మనకు ఎదురులేదని ఎవరైనా చెపితే అది వాట్సాప్ పాండిత్యం తప్ప మరొకటి కాదు. వర్తమాన బలా బలాల గురించి ఈ సందర్భంగా చూద్దాం. మన దగ్గర ఐదు వేల కిలోమీటర్ల దూరం ప్రయోగించగల ఖండాంతర క్షిపణి అగ్ని-5 ఉంది. ఇతర దేశాలలో మినిట్?మాన్?-అమెరికా క్షిపణి 13,000 కిమీ, రష్యాలో ఆర్?ఎస్?-28 శాటమాన్ క్షిపణి పదకొండువేల కి.మీ, చైనా వద్ద డాంగ్ ఫెంగ్-41 రకం తొమ్మిది వేల కిలో మీటర్లు ప్రయాణించగలవి ఉన్నాయి. ఉత్తర కొరియా వద్ద గరిష్టంగా 15 వేల కిలోమీటర్లు ప్రయాణించే క్షిపణి తయారీలో ఉన్నట్లు ఊహాగానాలు. దాని దగ్గర శక్తివంతమైన ద్రీర్ఘశ్రేణి క్షిపణులు ఉన్నకారణంగా తేడా వస్తే తన మిత్ర దేశంగా ఉన్న జపాన్ మీద ప్రయోగించగలదనే భయంతోనే అమెరికా ఒళ్లు దగ్గర పెట్టుకొని వ్యవహరిస్తున్నది. ఇలా ఒకరిని మించి ఒకరు తమ ఆయుధాలకు పదునుపె ట్టుకుంటున్నారు. ఈ పూర్వ రంగంలో మన దేశం కూడా తగిన జాగ్రత్తలు తీసుకొని ఆయుధాలను తయారు చేసు కోవాల్సిందే అనటం నిర్వివాదాంశం. దీనిలో భాగంగానే అణ్వస్త్రాలను తయారు చేసుకొనే అవకాశాలను అట్టిపెట్టు కొని అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకాలు చేసేందుకు నిరాకరించాం. గతంలో రెండుసార్లు మనం అణుపరీక్షలు జరిపినపుడు మిత్రదేశం అంటూనే మన మీద కక్షతో అమెరికా ఒక్కటే ఆంక్షలు విధించింది. శత్రు వైరుధ్యాలు ఉన్నప్పటికీ చైనా అలాంటి చర్యలకు పాల్పడలేదు. మానవాళికి ముప్పు తెచ్చే యుద్ధాలు వద్దని ప్రతి ఒక్కరూ కోరుకోవాలి. కానీ ఉన్మాదంతో కొందరు ఊగిపోతున్నారు. పదిహేను వందల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని దెబ్బతీసే మన తాజా క్షిపణి ధ్వని వేగం (గాలిలో గంటకు 1,225 కిలోమీటర్లు) పది మాక్?లంటే 12,250 కి.మీ వేగంతో ప్రయాణిస్తుందని పావు గంటలోనే పని ముగిస్తుందని చెబుతున్నారు. ఇది మన డిఆర్‌డిఓ శాస్త్రవేత్తల ప్రతిభకు నిదర్శనం. అయితే వారు ఇంకా ఎంతో సాధించాల్సి ఉంది. రష్యా వద్ద 27 మాక్?ల అవన్‌గార్డ్, చైనా వద్ద 27 మాక్?ల డిఎఫ్?-41, అమెరికా దగ్గర ట్రైడెంట్? 24, మినిట్?మాన్? 23, రష్యా వద్ద 20.64 మాక్‌ల క్షిపణులు ఉన్నాయి. అందు వలన మా దేవుడే అందరికీ అంటే ఎలా అంగీకరిం చటంలేదో ఇది కూడా అంతే. మన గొప్ప గురించి మనం చెప్పుకోవచ్చు తప్ప మనమే గొప్ప అంటే జనాలను తప్పుదారి పట్టించినట్లే. ప్రస్తుతం యుద్ధాల్లో కావాల్సింది ఎప్పటి సమాచారాన్ని అప్పుడు తెలియచేసే పరిజ్ఞానం. ఉక్రెయిన్?కు అలాంటి సత్తా లేనప్పటికీ పశ్చిమ దేశాలు అందచేసిన సమాచారంతో గడచిన నాలుగు సంవత్సరాలుగా రష్యాను అడ్డుకోవటమే గాక, కొన్ని దాడులు కూడా చేయగలు గుతున్నదంటే కారణం అదే. ఆపరేషన్? సిందూర్?లో తొలి రోజు మనకు ఎదురుదెబ్బలు తగలటానికి కారణం పాకిస్తాన్?కు పశ్చిమ దేశాలు (అమెరికాతో సహా) అందించిన సమాచారమే కారణంగా కొందరు భావిస్తున్నారు. అందుబాటులో ఉన్న తాజా సమాచారం ప్రకారం మిలిటరీ అవసరాల కోసం వినియోగించే ఉపగ్రహాలు అమెరికా దగ్గర 247, చైనా 157, రష్యా 110, ఫ్రాన్స్? 17, ఇజ్రాయిల్? 12, ఇటలీ 10, మన దేశం 9, జర్మనీ 8, బ్రిటన్? 6, స్పెయిన్? 4 కలిగి ఉన్నాయి. అందువలన భూమి చుట్టూ తిరిగే అవి ఒకదాని వెనుక ఒకటి సమాచారాన్ని పసిగడితేనే 24 గంటల్లో ఏం జరుగుతుందనేది తెలుసుకోవచ్చు. మిలిటరీతో సహా అన్ని అవసరాలకుగాను అమెరికా 5,176, బ్రిటన్? 653, చైనా 623, రష్యా 181, జపాన్? 88 కలిగి ఉండగా మన దేశం 62 కలిగి ఉంది. అయితే ఈ ఉపగ్రహాలు సేకరించే సమాచారం కూడా మిలిటరీ అవసరాలకు ఉపయోగ పడుతుంది. ఈ కారణంగానే ప్రపంచంలో ఏమూల ఏమి జరిగినా అమెరికా ఇట్టే పసిగడుతున్నదంటే ఈ వ్యవస్థలే కారణం. ఇటువంటి ఏర్పాట్లు ఉన్నప్పటికీ ప్రపంచానికి భద్రత లేదని, తనకు అన్ని వైపుల నుంచీ ముప్పు ఉన్నదని అమెరికా ప్రపంచాన్ని నమ్మించేందుకు గోబెల్స్? ప్రచారం చేస్తున్నది. గ్రీన్‌లాండ్ ప్రాంతాన్ని తాము ఆక్రమిస్తామని చెప్పిన ట్రంప్ తమ దేశ రక్షణకు ఉన్న "గోల్డెన్? డోమ్?" వంటి దాన్నే ఆ ప్రాంతానికి కూడా ఏర్పాటు చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. ఏమిటిది అంటే గగనతలం నుంచి జరిగే దాడుల నుంచి రక్షణ కల్పించటం.

# బడ్జెట్ సమావేశాలు ప్రారంభం..

## ఉభయ సభలు నేటికి వాయిదా



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశం ప్రారంభంలో సంప్రదాయంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. ఈ ప్రసంగంలో ఆమె విబిజిరామ్ జి చట్టంపై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, అభివృద్ధి కోసం విబిజిరామ్ జి 2025 చట్టాన్ని తెచ్చినట్లు ముర్ము అన్నారు. ముర్ము ప్రసంగంపై ప్రతిపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. విబిజిరామ్‌జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ఉభయసభలూ నేటికి వాయిదాపడ్డాయి. యుపిఎ హయాంలో ప్రవేశపెట్టిన ఉపాధిహామీ చట్టాన్ని (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) పునరుద్ధరణకు ప్రజాస్వామ్యయుతంగా పోరాడతామని కాంగ్రెస్ పేర్కొంది. ఈ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేసేందుకు ప్రతిపక్షాలు అన్ని ప్రజాస్వామ్య మార్గాలను వినియోగిస్తాయని తెలిపింది. బుధవారం పార్లమెంట్? బడ్జెట్? సమావేశాల ప్రారంభంలో ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించిన సంగతి తెలిసిందే. రాష్ట్రపతి ప్రసంగంలో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ బుల్డోజర్ రద్దుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు 'వాపస్? లో (వెనక్కి తీసుకోవాలి)' అంటూ నినాదాలు చేపట్టాయి. రాష్ట్రపతి సూచించిన విబి-జిరామ్‌జి చట్టానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్? చేశాయి. విబి-జిరామ్‌జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ఎంజిఎన్?ఆర్?ఇజిఎను పనిచేసే హక్కు, పంచాయితీల అధికారం హక్కుల ఆధారిత చట్టంగా దాని అసలు రూపంలో పునరుద్ధరించాలని డిమాండ్ చేశాయి.

# భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి: ఎమ్మెల్యే వెలగపూడి



**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** అమ్మవారి దర్శ నార్థం దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యాలకు ప్రాధా న్యత ఇవ్వాలని విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు పేర్కొ న్నారు. బుధవారం నగరం లోని పెద వాల్తేరు శ్రీ పోల మాంబ దేవాలయం ధర్మ కర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా నియమించబడిన ధర్మ కర్తల మండలి సభ్యులంతా ఎండోమెంట్ చట్టాల ప్రకారం నడుచుకొని ఎటువంటి అవినీతికి గానీ బంధు ప్రీతికి కానీ లోనవకుండా కేవలం భక్తులకు సౌకర్యాల కల్పన మీద దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన ధర్మ కర్తల మండలి దేవస్థానం అభివృద్ధికి కృషి చేయడంతో పాటుగా సామాన్య భక్తులకు మెరుగైన సేవలు అందించాలని దిశా నిర్దేశం చేశారు. తమకు వచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకుని మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ధర్మ కర్తల మండలి అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన మద్ది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను అధ్యక్షునిగా నియమించిన టీడీపీకి, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా పని చేస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ కర్తల మండలి సభ్యులుగా ఎ.మంగరాజు, పి. అనిల్ కుమార్, పి.వాసు, సిహెచ్.ఆనంద రెడ్డి, వి శ్రీనివాస్, వి. పూర్ణ, కె.సత్య కౌసల్యా రాణి, ఎస్.ఎస్ శ్రీనివాసా చార్యులు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ ఛైర్మన్ మరడ శ్రీనివాస్ రెడ్డి, టీడీపీ నాయకుడు బొట్టా వెంకట రమణ, పీతల అమరేంద్ర, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి పోతన రెడ్డి, పెద వాల్తేరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ బైరెడ్డి గోవింద రెడ్డి, 20వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కంభాపు శివారెడ్డి, టిడిపి నాయకుడు గొరుసు అప్పల రెడ్డి, 17వ వార్డు టీడీపీ నాయకుడు కాళ్ల శంకర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి గాయత్రి, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెట్టుపల్లి గ్రామంలో శ్రీ పైడితల్లి అమ్మవారి ఐదు రోజుల మహోత్సవాలు



**నర్సీపట్నం, పతాకం న్యూస్ :** నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో శ్రీపైడి తల్లి అమ్మవారి పండుగను ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పండుగకు సంబంధించిన పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆయన సతీమణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలు ఈరోజు ప్రారంభమై ఐదు రోజులపాటు కొనసాగుతాయి. మొదటి రోజు పాలఘటం కార్యక్రమం నిర్వహించనున్నారు. మూడవ రోజు నుంచి గ్రామ పురవీధులలో ఘటాల ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. పండుగకు ముందురోజు అమ్మవారి జాగరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. పెద్ద పండుగ వచ్చేనెల 1న జరగనుంది. ఉదయం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నసంతర్పణ, సాయంత్రం 6 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అనంతరం అమ్మవారి ఊరేగింపుతో పండుగ ముగుస్తుందని ఆలయ కమిటీ వెల్లడించింది. గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సమక్షంలో అత్యంత వైభవంగా ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

## విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం

# అజిత్ పవార్ మృతి



**పుణే:** మహారాష్ట్ర రాజకీయాల్లో ఓ షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ అనంతరావు పవార్ బుధవారం పుణేలో చార్టర్డ్ విమానం కూలిపోవడంతో దుర్మరణం చెందారు. ఈ ఘటనలో ఆయనతోపాటు విమానంలో ఉన్న మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. ముంబై నుంచి బారామతి వెళ్తున్న ఈ ప్రైవేట్ ఎయిర్?క్రాఫ్ట్ ఉదయం 8:45 గంటల సమయంలో క్రాష్ అయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అజిత్ పవార్ వయసు 66 సంవత్సరాలు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రయాణిస్తోన్న విమానం బారామతిలో ల్యాండ్ అయ్యే సమయంలో కుప్పకూలినట్టు తెలుస్తోంది. కూలిన వెంటనే విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అజిత్ పవార్.. బారామతిలో బహిరంగ సభకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు సమాచారం. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కూలిపోయి అగ్నికి ఆహుతైన విమానంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోపాటు, మరో ఇద్దరు సిబ్బంది (ఒక పీఎస్ఓ, ఒక సహాయకుడు) మరో ఇద్దరు (పైలట్, కో-పైలట్) మొత్తం ఐదుగురు ఈ చార్టర్ విమానంలో ఉన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, విమానంలో ఉన్న ఏ ఒక్కరూ ఈ ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడలేదని డీజీసీఏ (పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్) అధికారికంగా ప్రకటించింది. అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి- అజిత్ పవార్ వర్గం) అధ్యక్షులు. మహారాష్ట్రలో అత్యధిక కాలం ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు. 2024 డిసెంబరు 5 నుంచి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా ఉన్న మహాయుతి ప్రభుత్వంలో ఏక్‌నాథ్ షిండేతో కలిసి డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్నారు.

# జగన్‌పై మంత్రి లోకేశ్ ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహాపాపం చేసి కూడా బుకాయించుకోవటం జగన్ కే చెల్లిందంటూ వ్యాఖ్యలు చేశారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రులతో లోకేశ్ అల్పాహార విందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి అంశాన్ని ప్రస్తావించారు. పవిత్రమైన తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా నివేదికను వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని జగన్‌పై ఫైర్ అయ్యారు. పాలే లేని కల్తీ నెయ్యిని సృష్టించి దేవుడి ప్రసాదాన్ని అపవిత్రం చేయటం క్షమించరాని నేరమన్నారు. వందలకోట్ల కుంభకోణానికి పాల్పడటమే కాకుండా అసత్యాలతో ప్రజల్ని తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. వైసీపీ కుట్రలను ధీటుగా తిప్పికొట్టడంతో పాటు వారి భాగోతాన్ని ప్రజల్లోనే ఎండగడదామని మంత్రులతో జరిగిన సమావేశంలో నారా లోకేశ్ సూచించారు.

(మొదటిపేజీ తరువాయి)

# 35 అజెండా అంశాలకు కేబినెట్ ఆమోదం

శిల్పారామం ప్రాజెక్టుల కోసం ఎం& ఎస్ గార్డెన్ సిటీ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్‌కు జారీ చేసిన ఎల్వోఐలను రద్దు చేసి, కొత్తగా ఈవోఐలను ఆహ్వానించాలని మంత్రివర్గం నిర్ణయించింది. పీపీపీ విధానంలో గుంటూరు శిల్పారామంలో సాంస్కృతిక కేంద్రం & వినోద జోన్ అభివృద్ధికి ఆమోదం తెలిపింది. పీఎంవై(యూ) మౌలిక సదుపాయాల పనులను రద్దు చేసి, తిరిగి టెండర్లు పిలవడం, రూ.226.36 కోట్ల సవరించిన అనుమతిని ఆమోదించింది. శ్రీ వెంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ చట్టం, 2006 లోని "లెప్రసీ" అనే పదాన్ని తొలగిస్తూ సవరణకు ఆమోదం తెలిపింది. ఏపీఎస్బీసీఎల్ రుణాల ద్వారా వనరుల సమీకరణకు సంబంధించి ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన మెమోలను ఆమోదించింది. ద్వారకాతిరుమలలో శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి 2 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ డ్యూటీ (సవరణ) బిల్లు, 2026ను రాష్ట్ర శాసనసభ ముందు ప్రవేశపెట్టేందుకు మంత్రివర్గం అనుమతి తెలిపింది. కల్తీపై నెయ్యిపై సిట్ ఇచ్చిన నివేదికపై చర్చ: టీటీడీ లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యిలో కల్తీపై సిట్ ఇచ్చిన నివేదికపై కేబినెట్?లో చర్చ జరిగింది. సిట్ నివేదికపై వైఎస్సార్సీపీ చేస్తున్న దుష్ప్రచారంపై చర్చించారు. దీనిపై సిట్ నివేదిక తెప్పించాలని కేబినెట్ కోరింది. ఇప్పటికే సీబీఐ ఆధ్వర్యంలోని సిట్ చార్జిషీట్ వేసిన విషయాన్ని అధికారులు చెప్పారు. సిట్ నివేదిక అధికారికంగా వచ్చిన దానిపై స్పందించాలని సీఎం చంద్రబాబు మంత్రులకు సూచించారు. ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత యర్రాజీ జ్యోతికి ప్రోత్సాహకాలు కేబినెట్ ఆమోదంపై క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి పేరు తెచ్చిన క్రీడాకారులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో క్రీడాకారుల భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉంటుందని అన్నారు. యర్రాజీ జ్యోతికి ప్రోత్సాహకాలు అందించడంలో మంత్రి నారా లోకేశ్ చూపిన ప్రత్యేక చొరవకు ధన్యవాదాలు తెలిపారు. యువ క్రీడాకారులకు భవిష్యత్‌కు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు.

# వచ్చే నెల 12న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



**నక్కపల్లి, పతాకం న్యూస్:** ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ పూర్తిగా కార్మిక వ్యతిరేక విధానాలేనని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకర్రావు తీవ్రంగా ఖండించారు. కార్మికుల శ్రమ హక్కులను కాలరాసేలా, కార్మిక చట్టాలను నీరుగార్చేలా కేంద్ర ప్రభుత్వం ఈ లేబర్ కోడ్స్‌ను అమలు చేయాలని చూస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటిత కార్మిక ఉద్యమాలను అణిచివేసేందుకు ఈ కోడ్స్‌ను ఆయుధంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. దేశంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికులను దోపిడీ చేయడం అన్యాయమని ఆర్. శంకర్రావు పేర్కొన్నారు. కనీస వేతనాల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, అన్ని వర్గాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత, కార్మిక హక్కుల పరిరక్షణ వంటి డిమాండ్లతో ఫిబ్రవరి 12వ తేదీన జరగనున్న దేశవ్యాప్త ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు ఈ పోరాటంలో భాగస్వాములై తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మనబాల రాజేష్, నాయకులు , సుబ్బలక్ష్మి,రమణమ్మ, ధనలక్ష్మి , జయలక్ష్మి, నాగమణి, అపర్ణ పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్,ఎస్పీ ఆఫీసులను అనకాపల్లి పట్టణంలో పెట్టాలి.. సీఎం చంద్రబాబుకి దాడి రత్నాకర్ లేఖ

### (మొదటిపేజీ తరువాయి)

డి.వి.ఆర్. కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో వివరించిన దాడి. జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంసీ)కి న్యూకోలానీ లోని ఎకరం 60 సెంట్ల స్థలము ఉంది 7,940 చదరపు గజాల స్థలాన్ని వియంఆర్డీఏకి అభివృద్ధి చేసే ప్రతిపాదిన చేస్తే జిల్లా పోలీస్ సూపరింటెండెంట్,కేంప్ ఆఫీసు, మరియు వివిధ ప్రభుత్వ, కార్పొరేట్ కార్యాలయాలకు అద్దె ప్రాతిపదికన కేటాయించే విధముగా రెండు పార్కింగ్ అంతస్థులు, 5అంతస్తుల పరిపాలన భవనమును నిర్మించుటకు చర్యలు తీసుకోవలసిందిగా కూడా రత్నాకర్ తన లేఖలో కోరడమైనది. దీనివలన పార్కింగ్ అంతస్తులు కాక మరో లక్షన్నర చదరపు అడుగుల నిర్మిత స్థలం లభిస్తుంది. దీని ద్వారా డి.సి. యం.ఎస్ కు రూపాయి పెట్టుబడి లేకుండా కోట్లాది రూపాయల ఆస్థి మరియు అధిక మొత్తంలో ఆధాయం సమకూరుతుంది. రిజిస్ట్రేషన్ రేట్లు ప్రకారం కాళీ స్థలం చదరపు గజం రూ.55,000 చొప్పున సుమారు 43 కోట్ల రూపాయలు వుంది. లోకల్ మార్కెట్ రేటు ప్రకారం చదరపు గజం రూ. 1.50 లక్ష ప్రకారం రూ.120 కోట్లు వుంది. ఇంత విలువ అయిన స్థలం ముందుభాగాన్ని గత ప్రభుత్వం పెట్రోల్ బంక్ నిమిత్తం కేటాయించగా ఎంపీ సియం రమేష్ ప్రమేయంతో ఆ పనిని ఆపుచేయించి స్థలాన్ని కాపాడటం జరిగింది. కానీ ఇప్పుడు మరలా పనిని ప్రారంభించి స్థలం విలువను నష్టపరిచి, క్రమేపీ మొత్తం స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం కొందరు చేస్తున్నారు. అందువలన కూటమి ప్రభుత్వానికి దారుణంమైన చెడ్డపేరు వస్తుంది అని లేఖలో వివరించారు.వివిధ ప్రయివేటు స్థలముల్లో అద్దెలు చెల్లిస్తున్న కార్యాలయాలను ఈ రెండు పరిపాలన భవనాలకు తరలించినతో ప్రజలకు అధికారులు సమీపంలో వుండడమే కాకుండా జీవీయంసి, వియ్యంఆర్డీఏ మరియు డిసియంసి సంస్థలకు ఆర్థికంగా ప్రయోజనకరంగా వుంటుంది. సదరు విలువైన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా, సద్వినియోగం అవుతాయని, జిల్లా ప్రజల ప్రయోజనాలు కాపాడబడతాయని దాడి రత్నాకర్ తన లేఖలో రాశారు. దీనిపై స్పీకర్, కలెక్టర్, జిల్లా మంత్రులు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు,జిల్లా ప్రజాప్రతినిధులందరు కృషిచేసి జిల్లా యంత్రాంగాన్ని ఒకే చోట త్వరలో చేర్చాలని దాడి రత్నాకర్ విలేకరులు సమావేశంలో విజ్ఞప్తి చేశారు.

## చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వాల తోడ్పాటు



**పరవాడ, పతాకం న్యూస్:** చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు చదువుకుని, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటునందిస్తాయని ఎంఎస్ఎంఈ, జెడ్ వర్క్ షాప్ &సర్టిఫికేషన్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. పరవాడ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో కళ్ల జగపతి అధ్యక్షతన ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ల జగపతి మాట్లాడుతూ చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే యువ పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం జెడ్ (జీరో ఎఫెక్ట్, జీరో డిఫెక్ట్) సర్టిఫికెట్ ఉచితంగా జారీ చేస్తున్నదని చెప్పారు. అలాగే పారిశ్రామికవేత్తలుగా ముందుకు వచ్చే యువతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 3లక్షల వరకూ రుణ సదుపాయంతో పాటు, రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తాయన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సాగర్, ఎంఎస్ఎంఈ సిబ్బంది, పరవాడ మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, చిన్నతరహా పరిశ్రమల ప్రతినిధులు, పాల్గొన్నారు.

## అనకాపల్లి ఉత్సవ్ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పంచకర్ల



**పరవాడ, పతాకం న్యూస్ :** పరవాడ మండలం, ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతంలో బుధవారం నాడు అనకాపల్లి ఉత్సవ్ ఏర్పాట్లను పరిశీలించడానికి పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు పర్యటించారు. అనకాపల్లి ఉత్సవ్‌కు సంబంధించిన వివిధ శాఖల అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే కూటమి నాయకులకు, వాలంటీర్లకు బాధ్యతలు అప్పగించారు. సమిష్టి కృషితో అనకాపల్లి ఉత్సవ్ ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు, కూటమి నాయకులు, స్థానిక సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-2 ఫలితాల్లో ఏఎస్ఓగా ఎంపికైన కన్నతల్లి

- **కాశీపురం గ్రామానికి గర్వకారణం**
- **స్ఫూర్తిదాయకం: ఒకే ఇంటి నుంచి ముగ్గురు ప్రభుత్వ అధికారులు**



**దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా), పతాకం న్యూస్:** సంకల్పం బలంగా ఉండాలే కానీ, పేదరికం గానీ, గ్రామీణ నేపథ్యం గానీ విజయానికి అడ్డుకావని అనకాపల్లి జిల్లాకు చెందిన ఆదిరెడ్డి సోదరీమణులు నిరూపిస్తున్నారు. ఇటీవల ఏపీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామానికి చెందిన ఆదిరెడ్డి కన్నతల్లి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (GAD)గా ఎంపికై తన ప్రతిభను చాటుకున్నారు. కన్నతల్లి ప్రస్తుతం మంగళగిరిలోని చేనేత, జౌళి శాఖ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. తన తాజా విజయంపై ఆమె మాట్లాడుతూ.. "మా అక్కలు, బావలు అందించిన ప్రోత్సాహమే నన్ను ఈ స్థాయికి చేర్చింది. ముఖ్యంగా నా గురువు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు గారి మార్గదర్శనం, వారి శిక్షణా తరగతులు నా విజయానికి పునాది వేశాయి" అని తెలిపారు.

ముగ్గురు సోదరీమణులు.. మూడు ఉన్నత ఉద్యోగాలు: ఆదిరెడ్డి నాయుడు, మహాలక్ష్మి దంపతుల ముగ్గురు కుమార్తెలూ నేడు ప్రభుత్వ ఉన్నతాధికారులుగా రాణించడం విశేషం. పెద్ద కుమార్తె విజయరామలక్ష్మి 'డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్'గా, రెండో కుమార్తె సంధ్య 'డిప్యూటీ తహసీల్దార్'గా ఇప్పటికే సేవలందిస్తున్నారు. తాజాగా చిన్న కుమార్తె కన్నతల్లి ఏఎస్ఓగా ఎంపికవ్వడంతో ఆ కుటుంబ కీర్తి మరింత పెరిగింది. ఆడపిల్లలకు చదువుతో పాటు సరైన ప్రోత్సాహం అందిస్తే వారు ఆకాశమే హద్దుగా రాణిస్తారని ఈ సోదరీమణులు నిరూపిస్తున్నారు.

**డెప్యూటీ కలెక్టరే అంతిమ లక్ష్యం:** ప్రస్తుతం ఏఎస్ఓగా ఎంపికైనప్పటికీ, తన పయనం ఇక్కడితో ఆగదని కన్నతల్లి స్పష్టం చేశారు. భవిష్యత్తులో గ్రూప్-1 సాధించి డెప్యూటీ కలెక్టర్?గా ప్రజాసేవ చేయడమే తన జీవిత లక్ష్యమని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కాశీపురం గ్రామం నుంచి, వరుసగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్న ఈ సోదరీమణులను చూసి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జీవవైవిధ్య పరిరక్షణకు పర్యావరణ విద్య అవసరం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవవైవిధ్య పరిరక్షణకు పర్యావరణ విద్య అవసరమని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. ఉదయం మద్దిలపాలెం లోని శ్రీ భావన విద్యా నికేతన్, అక్షర ఇంగ్లీష్ మీడియం విద్యా సంస్థలలో, అంతర్జాతీయ పర్యావరణ విద్యా దినోత్సవాన్ని, అంతర్జాతీయ స్వచ్ఛ విద్యుత్తు దినోత్సవం కార్యక్రమాలను గ్రీన్ సోల్జర్స్ తో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు దినోత్సవాలనూ ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో జనవరి 26న నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలి అని కోరారు. వాతావరణ సంక్షోభాన్ని ప్రధానంగా వెలుగులోకి తీసుకువచ్చి, భద్రమైన, మరింత సహనశీలమైన, స్థిరమైన భవిష్యత్తును అందించే పరిష్కారాలపై దృష్టి సారించాలి అని కోరారు. ప్రజలు, భూమి, సమస్త జీవరాశి ప్రయోజనాల కోసం, స్వచ్ఛమైన, సమగ్రమైన పరివర్తన కోసం అవగాహన పెంచడానికి, కార్యాచరణను సమీకరించడానికి కృషి చేయాలని అన్నారు. క్లీన్ ఎనర్జీని స్వీకరించడం ద్వారా శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలని కోరారు. ప్రతి విద్యా సంస్థలో హరిత సైనికులను (గ్రీన్ సోల్జర్స్) ఏర్పాటు చేయడం ద్వారా వారానికి ఒకరోజు రెండు గంటల పాటు పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు చేత కార్యక్రమాలు నిర్వహించాలని, నెలలో ఒక రోజు పర్యావరణ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ భావన విద్యా నికేతన్ లో నీలిమ, అక్షర ఇంగ్లీష్ మీడియం విద్యా సంస్థలో సునీత, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు మాట్లాడారు .

## 31న గవరపాలెం గౌరమ్మ సంబరం

**అనకాపల్లి, పతాకం న్యూస్:** స్థానిక గవరపాలెం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం ఈ నెల 31వ తేదీ శనివారం ఘనంగా నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోశ్ అప్పారావు నాయుడు చెప్పారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉత్సవంలో భాగంగా 28వ తేదీ ఉదయం గౌరీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామని, మధ్యాహ్నం పిండివంటలు, మిఠాయిలతో సారె ఊరేగింపు మహోత్సవ వుంటుందని చెప్పారు. 29వ తేదీన కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి సౌజన్యంతో మెగా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 30వ తేదీన పార్కు జంక్షన్ వద్ద తీర్థం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తరాంధ్రస్థాయి నృత్య పోటీలు వుంటాయని వెల్లడించారు.

## ఉత్సాహభరితంగా 'విశాఖ ఉత్సవ్'




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ ఉత్సవ్‌లో కాస్త జోష్ పెరిగింది. కార్యక్రమాలు ఉత్సాహభరితంగా లేవని ప్రచారం జరగడంతో నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు. గాయకుడు జావెద్ అలీ పాడిన పాటలు సందర్శకులను వేదిక వైపు రప్పించాయి. అంతకు ముందు దిల్లుభాయి బ్రదర్స్ ప్రదర్శించిన నృత్యాలు యువతను ఉత్సాహపరిచాయి. టిక్ టాక్ గేమ్ రవి పిల్లలతో చేసిన ప్రదర్శన నవ్వులు పూయించింది. ఉత్సవ్‌కు ప్రజా ప్రతినిధులు కూడా రావడం లేదని వార్తలు రావడంతో మంగళవారం ఎంపీ శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ హాజరయ్యారు. పర్యాటకుల కోసం ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, విశాఖ ప్రజలు వీటిని విజయువంతం చేయాలని ఎంపీ శ్రీభరత్ కోరారు. ఉత్సవాలపై మెల్లగా ప్రచారం ఊపందుకోవడంతో ఏమి జరుగుతున్నదో చూడాలని వచ్చేవారి సంఖ్య పెరిగింది. ఫుడ్ స్టాళ్లు యథా ప్రకారం కిటకిటలాడాయి. వాహనాలతో బీచ్‌రోడ్డులోకి రావడానికి అనుమతించడంతో మంగళవారం సందర్శకుల సంఖ్య పెరిగింది.

## ఆదివాసీల డిమాండ్లను పరిష్కరించాలి: బాలదేవ్



**అరకులోయ, పతాకం న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరకు చలి ఉత్సవాలకు హాజరు కావడానికి ముందే ఆదివాసుల హక్కులు, ఉపాధి, పర్యావరణ రక్షణకు సంబంధించిన ముఖ్యమైన డిమాండ్లను ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ లేవనెత్తింది.అరకువేలి గిరిజన సంఘం భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ అనంతగిరి, అరకువేలి, చింతపల్లి, జి.కె.వీధి మండలాల్లోని గుజ్జెలి, చిట్టంవలస, పెదకోట, ఎర్రవరం, సీలేరు వంటి ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో 6100 మెగావాట్ల సామర్థ్యంతో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నవయుగ, అదాని, శిరిడి సాయి ఎలక్ట్రికల్ కన్స్ట్రక్షన్, మెగా బడా వంటి కార్పొరేట్ కంపెనీలకు అనుమతులు ఇచ్చిందని ఆరోపించారు. ఇది ఆదివాసి హక్కుల చట్టాలను ఉల్లంఘిస్తుందని, ప్రాజెక్టు అమలైతే 25 పంచాయితీలు, 250 గ్రామాలు, సుమారు 60 వేల మంది ఆదివాసులు, వేల ఎకరాల జీరాయితి అటవీ భూములు, కాఫీ తోటలు, వన్యప్రాణులు జలసమాధి అవుతాయని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో హైడ్రో పవర్ ప్రాజెక్టులకు సంబంధించిన జీవోలు నెంబర్లు 2, 13, 51 తక్షణమే రద్దు చేస్తూ ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేసి ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా, ప్రపంచ ప్రసిద్ధి చెందిన అరకు కాఫీ పండించే ఆదివాసి రైతులకు బెర్రీ బొరర్ వ్యాధి వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని, డుంబ్రిగూడ మండల పరిధిలో 10 పంచాయితీలు, 38 గ్రామాల్లో 152 ఎకరాల్లో 176 మంది రైతులు దెబ్బతిన్నారని తెలిపారు. ఈ నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని కోరారు.మెగా డీఎస్సీలో ఆదివాసి ప్రాంతాల్లో 100% ఉపాధ్యాయ పోస్టులకు గిరిజనులకు రిజర్వేషన్ అమలు చేయాలని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినప్పటికీ ఇంకా స్పష్టమైన ఉత్తర్వులు జారీ కాలేదని ఆరోపించారు. దీంతో అల్లూరి జిల్లాలోనే 92% ఉపాధ్యాయ పోస్టులు నాన్-లోకల్స్?తో భర్తీ అయ్యాయని, సుమారు 4500 పోస్టులు ఆదివాసులు కోల్పోయారని విమర్శించారు. 2026 డీఎస్సీ నిర్వహణ సందర్భంగా టెట్ పరీక్షలు జరిగినా, 100% రిజర్వేషన్ ఉత్తర్వులు రాకపోవడంతో ఆదివాసి యువతలో తీవ్ర నిరసన పెరిగిందని తెలిపారు.అందుకే, 2026 డీఎస్సీలో ఆదివాసీ యువతకు న్యాయం చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ ఖాళీలను జనరల్ డీఎస్సీలో విలీనం చేయవద్దని, 100% రిజర్వేషన్ అమలుకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి. బుజ్జిబాబు, మండల నాయకులు మాజీ ఎంపీటీసీ బురిడీ దశరథ్, మొద్దు, జగన్నాథం పాల్గొన్నారు.

## వయ్యేడులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** రాజవొమ్మంగి మండలంలో వోయ్యేడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పై మండల వ్యవసాయ శాఖ అధికారి బి చక్రధర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పురుగు మందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేసుకోవాలని సూచించారు. అధిక మోతాదు లో యూరియా వాడడం వల్లన పంటలకి పురుగులు, తెగుళ్ళు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయని అన్నారు, అలాగే నేల సారవంతం తగ్గుతుందని తెలిపారు. ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల విషపూరిత ఉత్పత్తులు వస్తునాయని అధికంగా వాడటం వల్ల ఆరోగ్యశీ పడవుతుందని, తెలిపారు. అలాగే తదుపరి సీజన్ నుండి పంట నమోదు చెయ్యించుకున్న వాళ్లకి మాత్రమే యూరియా సరఫరా చెయ్యడం జరుగుతుందని తెలిపారు, మరియు రైతులు అందరు తప్పకుండా మీ సచివాలయం లో ఉన్న విఏఏ ని కలిసి ఏపీ అగ్రిస్టాక్ లో పేరు నమోదు చెయ్యించుకోవాలి, అగ్రిస్టాక్ లో పేరు నమోదైన వాళ్లకి మాత్రమే వచ్చేసారి నుండీ పి ఎం కిసాన్ మరియు అన్నదాత సుఖీభవ డబ్బులు తమ ఖాతాలలో జమ అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమం లో ఏఈఓ భవానీ, వి ఏ ఏ లు భరద్వాజ్, సాయి, రైతులు పాల్గొన్నారు

# హైడ్రో పవర్ ప్రాజెక్టుపై చంద్రబాబు ప్రకటన చేయాలి




**అరకులోయ, పతాకం న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా, హుకుంపేట మండలం బూర్జ గ్రామపంచాయతీలోని మజ్జివలస హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు సీఎం పర్యటనను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అరకు చలి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే ముందు హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్ట్ అనుమతులకు సంబంధించిన జీవోలు నంబర్లు 51, 13, 2 రద్దు చేస్తూ అరకు సభలో ప్రకటన చేయాలని కమిటీ డిమాండ్ చేసింది. ఈ ప్రాజెక్ట్‌తో గిరిజన ప్రజల భూములు, జీవనోపాధికి తీవ్ర నష్టం జరుగుతుందని, చట్టవిరుద్ధంగా రాత్రిపూట డ్రోన్లతో సర్వేలు జరుపుతున్నారని ఆరోపించారు. అరకు చలి ఉత్సవాల పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని, హైడ్రో పవర్ ప్రాజెక్ట్?ను వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్?లు గత ప్రభుత్వ హయాంలో అదానీ, నవయుగ వంటి కంపెనీలకు అనుమతులు ఇచ్చినవిగా, ప్రస్తుతం గిరిజనుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇలాంటి ప్రాజెక్టులు ౹ాజులూాా చట్టం, ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ వంటివి ఉల్లంఘిస్తున్నాయని విమర్శలు ఉన్నాయి. ఈ సందర్భంగా సురేష్ కుమార్, కృష్ణంరాజు, బాలరాజు, పరశురాం, వరుణ్ కుమార్, గోపాల్, బొంజుబాబు, ధరఫ, రామారావు, మాణిక్యం, శ్రీనివాసరావు, పి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## బలపం పంచాయతీలో అభివృద్ధి పనులు ప్రారంభం



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా చింతపల్లి మండలంలోని మారుమూల పంచాయతీ అయిన బలపం పంచాయతీ పరిధిలోని చెరు వూరు-కోరుకొండ గ్రామాల మధ్య రహదారి, వంతెనల నిర్మాణానికి, అదే క్రమంలో కోరుకొండ బంద్రెవ్ వంతెనల నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన కోటి 90 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభించారు వర్షాకాలంలో ఆ గ్రామాల మధ్య చెరువు నీరు పొంగిపొర్లడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజల దీర్ఘకాలిక డిమాండ్?ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ నిర్మాణ పనులు పూర్తయితే విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, గ్రామస్తులు సురక్షితంగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పంచాయతీ సర్పంచ్ కె రమేష్ నాయుడు, వైకాపా నాయకులు బచ్చలి బాబురావు, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మంజూరు చేసిన నిధులతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ వార్డు సభ్యులు కృష్ణ, లింగరాజు, లింగరావు, లక్ష్మి, సోమరాజు, కూటమి నాయకులు అప్పారావు, చిట్టీబాబు, నారాయణరావు, వీరయ్య దొర పాల్గొని తమ మద్దతు తెలిపారు. అలాగే గ్రామ పెద్దలు మత్స్య లింగం, నగేష్ రావు, చిట్టీబాబు, రామారావు, చిన్నబాయ్, బాబురావు, బాలకృష్ణ, లక్ష్మణ్ లోత, పరమేష్, కోయంగి, పండమ్మ వండలం, చంటిబాబు, శ్రీనివాస్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

## వాస్తవ విలువలను పరిగణలోనికి తీసుకుని మార్కెట్ విలువలు పెంచండి



**నక్కపల్లి, పతాకం న్యూస్:** త్వరలో పెంచనున్న మార్కెట్ విలువలకు రివిజన్, వాస్తవ విలువలను పరిగణలోకి తీసుకొని పెంచవలసిందిగా నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్కు వినతిపత్రం అందజేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు చిక్కాల శ్రీనివాసరావు,దనిశెట్టి తిరుమలేశ్వర్రావు నక్కపల్లి సబ్ రిజిస్టర్ కు వినతి పత్రం అందజేశారు. పాయకరావుపేట లోని అన్ని లేఔట్ లలో విలువలను ఒకే మాదిరిగా ఉంచారని వాస్తవానికి సర్వేనెంబర్ 58,88,54 తదితర బైపాస్ రోడ్ లోని ఉన్న స్థలాల మార్కెట్ విలువలు వాస్తవ ధర 2500నుంచి 3000 ఉండగా గత రివిజన్లోని ఎనిమిది వేలకు పెంచారన్నారు. మరలా పెంచితే రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి సామాన్యులకు ఇబ్బంది కలుగుతున్నదని, ఈ మేరకు వాస్తవ విలువలను సేకరించి ఆ మాదిరిగానే మార్కెట్ విలువలు పెంపు చేయాలని వీలైతే తగ్గించడానికి కూడా చూడాలని వారు సబ్ రిజిస్టర్ చెన్నా నరసింహ మూర్తిని కోరారు.

## నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం



**నక్కపల్లి, పతాకం న్యూస్:** నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు గా ప్రముఖ హాస్య నటులు మరియు జబర్దస్త్ ఫేమ్ సరదా సత్తిపండు , తెలుగుదేశం పార్టీ పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ హాజరయ్యారు. సత్తిపండు తన హాస్యం తో విద్యార్థులును చక్కగా అలరించారు. వెంకటేష్ 10 వ తరగతి విద్యార్థులు అందరూ బాగా చదువుకుని అందరూ పాస్ అయి భవిష్యత్ లో ఉన్నత స్థాయి కి ఎదగాలని సూచించారు. 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులు అందరికీ తన సొంత ఖర్చు తో పెన్నులు బహుకరించారు . 10 వ తరగతి విద్యార్థులకు పాఠశాల చైర్మన్ అడ్డూరి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ నక్కపల్లి టౌన్ ప్రెసిడెంట్ అడ్డూరి లోవరాజు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. విజయ , ఉపాధ్యాయులు టి. వి. రమణ డి. శ్రీనివాసరావు, పి. శ్రీనివాస్,కె. వనజ, సరోజినీదేవి, మాధవిలత, కిరణ్మయి, శ్యామల, సత్యనారాయణ,రాజశేఖర్, మహాలక్ష్మి, వాణి, వరలక్ష్మి, జాస్మిన్, భవ్య, వెంకటరమణ, ధనలక్ష్మి తదితరులు ఏవిధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాదించాలని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనల తో అలరించారు. చదువు, ఆటల లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

## కొయ్యూరు మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌కు ఉత్తమ సేవా పురస్కారం

**కొయ్యూరు, పతాకం న్యూస్ :** కొయ్యూరు మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డి. బాల మురళీకృష్ణకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. మండలంలో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించిన జిల్లా యంత్రాంగం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న పాడేరు వేదికగా జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అందజేశారు. ఇంతకు ముందు అల్లూరి సీతారామ రాజు జిల్లా తొలి కలెక్టర్ సుమిత్ర కుమార్ గాంధీ చేతుల మీదుగా ఒకసారి, ప్రస్తుతం కలెక్టర్ చేతుల మీదుగా రెండవసారి సారి మొత్తంగా మూడు సార్లు ఈ పురస్కారాన్ని అందుకోవడం విశేషం. పంచాయతీ రాజ్ విభాగంలో పరిపాలనా పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసినందుకే ఈ పురస్కారం అందించినట్లు అధికారులు తెలిపారు.

## గొలుగొండ మండలం లింగంపేట పాఠశాలకు జాతీయస్థాయి గుర్తింపు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టత్మంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయం(ఎచ్ ఎచ్‌విఆర్) పురస్కారాలకు రాష్ట్రం లో సుమారు 60 వేల పాఠశాలల నుండి దరఖాస్తులు పంపించగా కేవలం 20 పాఠశాలలను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడం జరిగింది. రాష్ట్రంలో ఎంపిక చేసిన 20 పాఠశాలలో అనకాపల్లి జిల్లా,గొలుగొండ మండలం, లింగంపేట ప్రాథమిక పాఠశాల రాష్ట్ర స్థాయిలో ఎంపికై,జాతీయస్థాయికి నామినేట్ చేయడం జరిగిందని అని పాఠశాల ఉపాధ్యాయుడు రమణమూర్తి తెలిపారు. లింగంపేట పాఠశాల అవార్డు కు ఎంపిక కావడంతో అధికారులు,గ్రామ ప్రజలు, మండల ఉపాధ్యాయులు అందరూ హర్షం వ్యక్తం చేశారు.ఈ అవార్డు రావడం వెనుక ఉపాధ్యాయ సిబ్బంది యొక్క కృషి, మండల విద్యాశాఖ అధికారులు యొక్క ప్రోత్సాహం, గ్రామ ప్రజల సహకారం ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.రమణమూర్తి తెలిపారు.పాఠశాలలో ప్రధానంగా డ్రింకింగ్ వాటర్ ఫెసిలిటీస్, రన్నింగ్ వాటర్ ఫెసిలిటీస్,టాయిలెట్స్ నిర్వహణ వినియోగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం,పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఏకో క్లబ్స్ ఏర్పాటు చేయడం,రైన్ వాటర్ హార్వెస్టింగ్, ఇంకుడు గుంత,కంపోస్ట్ ద్వారా ఎరువులు తయారుచేసి మొక్కలకు వేయడం,వివిధ రకాల పండ్ల మొక్కలు అరటి,జామ, మామిడి,సపోటా,పనస, ఉసిరి మొదలైన పండ్ల మొక్కలు,న్యూట్రి మరియు కిచెన్ గార్డెన్ గార్డెన్స్ సంబంధించి గోంగూర,తోట కూర,బచ్చల కూర,మునగ మొదలైన ఆకుకూరలు మొక్కల పెంచి పిల్లలకు చక్కని పోషకాహారం పట్ల అవగాహన కల్పించి పోషకాహారం అందించడం జరుగుతుంది. అలాగే ఆరోగ్యానికి సంబంధించి హ్యాండ్ వాష్ డే ఎలా చేయాలి అనేటువంటి వాటిపై కూడా అవగాహన ర్యాలీలు,ఏర్పాటు చేయడం, మెడికల్ సిబ్బందిచే ప్రత్యేకమైనటువంటి కౌన్సిలింగ్ ఇప్పించడం, తదితర కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నిర్వహించడం జరుగుతుంది అని వివరించారు.స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో భాగంగా పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడానికి ఆయా ఎండిఎం సిబ్బంది,ఉపాధ్యాయ సిబ్బంది,అందరినీ కోఆర్డినేట్ చేసి ఓ చక్కని ప్రణాళికా బద్దంగా పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నాము.ఇలా చేయడం ద్వారా పాఠశాల అభివృద్ధిని గుర్తించినటువంటి రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి శ్రీనివాసరావు రాష్ట్రంలో ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరినీ సర్టిఫికెట్ ఇచ్చి దుస్సాలువాతో సత్కరించడం జరిగిందని వివరించారు. అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగింది అని అన్నారు.జాతీయ స్థాయిలో కూడా మా పాఠశాల ఎంపిక అవుతుందనే ఆశాభావం ఉందని అన్నారు.పాఠశాలను అభివృద్ధి చేయడంతో పాటు.అవార్డు రావడంతో స్కూల్ అభివృద్ధికి మరి ఎంతో బాధ్యత పెరిగిందని తెలిపారు. విద్యార్థిని విద్యార్థుల చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి బోధిస్తామని ప్రధానోపాధ్యాయులు రమణమూర్తి తెలియజేశారు. రాష్ట్రస్థాయి అవార్డు ఎంపిక చేసిన కలెక్టర్ కి,జిల్లా విద్యాశాఖ అధికారికి రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ కు మండల విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు రమణ మూర్తి కు తమ సొంత గ్రామమైన కంటారం గ్రామానికి మంచి పేరు తెచ్చినందుకు . ఉపాధ్యాయుడు వేంపాటి తలుపులు. మాజీ జడ్పిటిసి గాడి శ్రీరామ్ మూర్తి .గ్రామ పెద్దలు స్నేహితులు బంధువులు అభినందనలు తెలిపారు.

## ఎంపీడీవో ఏవివి కుమార్‌ను సత్కరించిన వీబీజీరామ్‌జీ సిబ్బంది



**అడ్డతీగల, పతాకం న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం డివిజన్ అడ్డతీగల మండల కేంద్రంలో వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం జరిగిన వారాంతపు సమావేశని ఎంపిడిఓ ఏవివి కుమార్ వారిని ఆహ్వానించడం జరిగిందని. జనవరి 26 గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ సేవ అవార్డు జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదగా అడ్డతీగల మండలంలో ఎంపీడీవోగా సేవనందించిన ఏవివి కుమార్ ప్రశంస పత్రం అందుకున్నారని వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని దుసల్వతో సన్మానించడం జరిగిందని ఏపీవో చిరంజీవి తెలిపారు. తదనంతరం పంచాయితీల వారిగ పురోగాతి రీవ్యూ చేయటం జరిగినదని, 100 - 150,రోజుల పనిదినాలు ఎక్కువ కుటుంబాలకు కల్పించాలని, అన్ని గ్రామపంచాయితీ లలో శ్రామికుల రిపోర్టు పెంచి, వేతన దారుల బడ్జెట్ పూర్తిస్తాయి లో పూర్తి చేయాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్స్, జేఈ, డీఏ పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నర్సీపట్నంలోని కాపీ క్యూరింగ్ వద్ద కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల హక్కులను పూర్తిగా రద్దు చేసినట్టే అని విమర్శించారు. ఇప్పటికే కార్మికులు అతి తక్కువ వేతనాలతో, చట్టాలు అమలు కాక యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై బతకాల్సిన పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో యావత్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, యూనియన్ నాయకులు ఎం. నూకరత్నం, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## 15 రోజుల టైలరింగ్, బోటిక్ కోర్సు ప్రారంభం



**కొయ్యూరు, పతాకం న్యూస్ :** పీఎం ఉషా పథకం లో భాగంగా పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా" వి చిట్టబ్బాయి ఆధ్వర్యంలో విద్యార్థినుల కోసం 15 రోజుల టైలరింగ్ మరియు బోటిక్ కోర్సు ప్రారంభించబడింది. ఈ కోర్సు మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సీఎంఎస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె సుధ మాట్లాడుతూ విద్యార్థినులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని, టైలరింగ్, బోటిక్ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించు కోవాలని, ఇది స్వయం ఉపాధికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ శిక్షణకు రిసోర్స్ పర్సన్?గా సూర్య కుమారి మాస్టర్ (శిక్షకురాలు) పాల్గొని, టైలరింగ్ మరియు బోటిక్ రంగాలకు సంబంధించిన ప్రాయోగిక శిక్షణను విద్యార్థినులకు అందిస్తున్నారు.

## జీఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం



**కొయ్యూరు, పతాకం న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐటిడిఏ పాడేరు (గిరిజన సంక్షేమ శాఖ) లోని ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఆధ్వర్యంలో కొ య్యూరు ఎంపీడీఓ కార్యాల యంలో గ్రామ/వార్డు సచివాల యాల సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చివరి స్థాయిలో ప్రభుత్వ సేవల అందజేతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు సంక్షేమ పథకాలలో ఎదురయ్యే తిరస్కరణలు, వాటి పరిష్కార విధానాలు, ఆధార్‌కు సంబంధించిన సమస్యలు, అలాగే సేవల అమలులో ఎదురయ్యే కార్యనిర్వహణ సమస్యలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రాం అమలు అధికారి ఆర్.రామ గోపాల్, అసిస్టెంట్ ప్రోగ్రాం అమలు అధికారులు రాజేష్,లోహిత్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బాల మురళి కృష్ణతో పాటు కొయ్యూరు మండలం ఎంపిడిఓ కార్యాలయ అధికారులు హాజరై, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు.ఈ శిక్షణతో గ్రామస్థాయిలో ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించడంలో జీఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బంది మరింత నైపుణ్యం సాధిస్తారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేటి నుంచి 'అరకు ఉత్సవ్'

### ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



**అరకులోయ, పతాకం న్యూస్:** పర్యాటకులకు మధురానుభూతి పంచేలా అరకు ఉత్సవ్‌ను నిర్వహించనున్నామని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. సాయంత్రం ఉత్సవ్ ప్రధాన వేదిక అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎస్పీ అమిత్‌బర్ధార్, పాడేరు డీఎస్పీ అభిషేక్‌తో కలిసి ఆయన ఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అరకు ఉత్సవ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. పర్యటనలో భాగంగా చొంపి గ్రామాన్ని సందర్శించి, అక్కడ హోం స్టేలను పరిశీలిస్తారని చెప్పారు. గిరిజనుల ఇళ్లలో పర్యాటకుల బస, వారి ఆతిథ్యంపై ముఖ్యమంత్రి స్వయంగా గిరిజనులతో చర్చిస్తారన్నారు. పర్యాటకులకు థ్రిల్లింగ్ కలిగేలా మాడగడ ప్రాంతంలో పారా గ్లైడింగ్, పారా మోటారింగ్‌తో పాటు పర్యాటకుల కోసం ప్రత్యేకంగా హెలికాప్టర్ (చాపర్) రైడ్, హాట్ ఎయిర్ బెలూన్లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. వైజాగ్ టీమ్ ఆధ్వర్యంలో తొలిసారిగా స్కూబా డైవింగ్ వంటి సాహస క్రీడలను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. గాలి కొండ, సుంకరమెట్ట ప్రాంతాల్లో ట్రెక్కింగ్ ఉంటుందన్నారు. జనవరి 31న 5కె రన్ (అరకు మారథాన్)ను అరకు డిగ్రీ కళాశాల నుంచి అంజోడ పైనరీ వరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాల గిరిజన తెగల సంప్రదాయ నృత్యాలు, కళలతో భారీ కార్నివాల్ నిర్వహించనున్నామన్నారు. ఈశాన్య రాష్ట్రాలు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే కళాకారుల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పద్మాపురం గార్డెన్స్‌లో ఫ్లవర్ షో, సరికొత్త 'అరకు బొకే' ఆవిష్కరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఆయన చెప్పారు. తిరుపతి ఇండియన్? క్యులినరీ ఇనిస్టిట్యూట్ సహకారంతో విశిష్ట గిరిజన వంటకాలను పర్యాటకులకు వడ్డించనున్నామని చెప్పారు. ఈ నెల 30న సాయంత్రం ప్రధాన వేదికపై హైదరాబాద్‌కు చెందిన షహరీ బ్యాండ్ ఉంటుందన్నారు. 31న సాయంత్రం ప్రముఖ గాయని సునీత లైవ్ కాన్సర్ట్ ఉంటుందని, ముగింపు రోజైన ఫిబ్రవరి 1న సాయంత్రం ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ థమన్ లైవ్ షోతో పాటు ఆకాశంలో అద్భుతమైన డ్రోన్ షో నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, శ్రేయాస్ మీడియా ఈవెంట్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. పర్యాటకులు మారథాన్, సైక్లింగ్ పోటీలకు ఆన్‌లైన్ లేదా క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

## మాజీ సైనికులకు ఇచ్చిన భూమిపై రగడ



**విజయనగరం, పతాకం న్యూస్:** గుర్ల మండలంలోని సదానంద పురం గ్రామంలో గల కొండ ప్రాంతంలో ప్రభుత్వం ఇచ్చిన భూమిని మాజీ సైనికులు మంగళవారం సాగు చేసు కుంటుంటే ఆ గ్రామస్థులు అడ్డుకున్నారు. అక్కడే టెంట్ వేసి, నిరసన చేపట్టారు. తమ పశువులను, మేకలను ఎక్కడ మేపాలని వారితో వాద నకు దిగారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సేవను గుర్తించి తమకు కొండ ప్రాంతాల్లో భూములు ఇచ్చాయని, ఇలా అడ్డుకోవడం భావ్యం కాదని మాజీ సైనికులు ఆవేదన వ్యక్తం చేశారు. కానీ గ్రామస్థులు 'ఈ భూములు మాకు కావాలి. మీరు వేరే చోట తీసుకోండి. ఈ భూములే మాకు జీవనాధారం' అని పట్టుబట్టారు. 20 ఏళ్ల కిందట తమకు ఇక్కడ భుములు ఇస్తే ఇప్పుడు కొత్తగా ఎందుకు అల్లరి చేస్తున్నారని మాజీ సైనికులు ప్రశ్నించారు.

## ఒక్కరోజులో రూ.8 వేలకు పైగా పెరిగిన బంగారం ధరలు



**ముంబై:** బంగారం, వెండి ధరలు భారీగా పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల వేళ పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం వైపు చూస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్?లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,70,447కు చేరుకుంది. నిన్న రూ.1,62,380గా ఉన్న బంగారం ధర ఈరోజు రూ.8,000కు పైగా పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,000 పలికింది. వెండి ధర రూ.4,00,000 దిశగా పరుగెడుతోంది. హైదరాబాద్?లో కిలో వెండి రూ.3.75 లక్షలుగా ఉంది. ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ.26,821 పెరిగి రూ.3.83 లక్షలకు పలికి రికార్డు స్థాయికి చేరుకుంది. 10 గ్రాముల బంగారం రూ.1.62 లక్షలకు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్?లో స్పాట్ బంగారం ధర ఔన్సు 5,296.79 డాలర్లకు, వెండి ఔన్సు 114 డాలర్లకు చేరుకుంది. మరోవైపు, డాలర్ విలువ నాలుగేళ్ల కనిష్ఠానికి పడిపోయింది.

# వెస్ట్ బైపాస్ రాకతో భారీ వాహనాలు మళ్లింపు.. తగ్గిన ట్రాఫిక్



**విజయవాడ, పతాకం న్యూస్:** పశ్చిమ బైపాస్‌లో ఒకవైపు వాహనాలను అనుమతించడం వల్ల విజయవాడ నగరం పై ట్రాఫిక్ ఒత్తిడి కాస్త తగ్గింది. ఈ ప్రభావం మహానాడు జంక్షన్ , స్క్యూ వంతెన వద్ద కనిపిస్తోంది. 2వ వైపు కూడా పనులు పూర్తి అయితే వాహన రద్దీ మరింత తగ్గే అవకాశం ఉంది. ఆటోనగర్?కు వచ్చే భారీ వాహనాలు ప్రస్తుతం నగరంలోకి వస్తున్నాయి. వీటికీ సమయాలను నిర్దేశిస్తే గనక మరింత వాహనాల రద్దీ తగ్గుతుంది. ఆ మేరకు అధికారులు అనుమతిస్తే ట్రాఫిక్ ప్రభావం మరింత తగ్గే అవకాశముంది. ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా గుంటూరు జిల్లా కాజ వద్ద సంక్రాంతికి పశ్చిమ బైపాస్‌పై వాహనాల రాకపోకలకు అనుమతిం చారు. దీంతో గుంటూరు వైపు నుంచి వచ్చి హైదరాబాద్‌కు ఏలూరు వైపు వెళ్లే వాహనాలు నగరంలోకి రావడం లేదు. గుంటూరు, విజయవాడ నగర పోలీసులు కాజ వద్ద ఉన్న వాహనాలను దారి మళ్లిస్తున్నారు. దీంతో నిత్యం వాహనాలతో కిటకిటలాడే నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గింది. సాధారణ రోజుల్లో వారధి నుంచి ఎనికేపాడు వరకు వాహనాలు నిలిచిపోతున్నాయి. సగటున దూరం రోజుకు 100 నుంచి 150 కిలోమీటర్ల ఉండేది. ప్రస్తుతం ఇది గణనీయంగా తగ్గింది. ఇప్పుడు రోజుకు సగటున 40 నుంచి 50 కిలోమీటర్ల లేపే ఉంటోంది. ఇక వీకెండ్, హాలిడే రోజులైతే వాహన రద్దీ మరింత పడిపోయింది. క్రమంగా 19 కి.మీ. మాత్రమే నమోదు కావడం గమనార్హం. ఏలూరు నుంచి వచ్చి గుంటూరు మార్గంలో వెళ్లేందుకు వాహనాలకు ప్రస్తుతం అనుమతించడం లేదు. ప్రస్తుతం కాజ వద్ద ఆ మార్గంలో ఇంకా పనులు పూర్తి కాలేదు. దీంతో చినఆవుటపల్లి వద్ద బైపాస్‌లోకి వాహనాలను పంపడం లేదు. అందుచేత విజయవాడ నగరంలోకి వస్తున్నాయి. వీటితో ఇంకా ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. ఆ మార్గంలో కూడా పనులు పూర్తి అయితే చాలా మేరకు రద్దీ తగ్గే వీలుంది. నగరంలోకి భారీ వాహనాలను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల లోపు అనుమతించడం లేదు. గుంటూరు వైపు బైపాస్ ఎక్కిన మచిలీపట్నం మార్గంలో వెళ్లే వాహనాలను గొల్లపూడి నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు, మహానాడు జంక్షన్ నుంచి లేదా శక్తి కల్యాణ మండపం మీదుగా తాడిగడప 100 అడుగుల రోడ్డులోకి మళ్లిస్తున్నారు. ఏలూరు వైపు నుంచే వాటిని కేసరపల్లి నుంచి ఉప్పులూరు మీదుగా కంకిపాడు వద్ద ఉన్న మచిలీపట్నం రహదారి పైకి పంపిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఆటోనగర్‌కు భారీ వాహనాలు నిత్యం వస్తుంటాయి. వీటికి సమయాలను నిర్దేశించక పోవడం వల్ల భారీగా వాహనాలు నగరంలోకి వస్తున్నాయి. ఇది ప్రస్తుతం సమస్యగా మారింది. బైపాస్ 2వ వైపు కూడా పనులు పూర్తి అయ్యాక భారీ వాహనాలు ఆటోనగర్‌లోకి అనుమతించే వేళలు నిర్ణయించే వీలుంది. ప్రస్తుతం ఆటోనగర్?నుంచి బయటకు వెళ్లే వాహనాలపై నియంత్రణ ఉంది. ఉదయం 8–10 గంటలు, సాయంత్రం 4–8 గంటల మధ్య బయటకు వచ్చేందుకు అనుమతి లేదు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్లన్నీ గోతుల మయమయ్యాయి. ఈ సమస్యకు పరిష్కారంగా కూటమి ప్రభుత్వం గత ఏడాది సంక్రాంతి నాటికి పూర్తయ్యేలా పల్లె పండగ 1.0 కింద 4,300 కి.మీ. మేర రహదారులు పనులు చేపట్టిన విషయం తెలిసిందే. వాటి కోసం ఉపాధి హామీ పథకంలో రూ.2,000 కోట్ల మెటీరియల్ నిధులు ఖర్చు చేసింది.

మరో 15,000 కి.మీ. రోడ్లు బాగు చేయాల్సి ఉండటంతో ఉపాధి పథకంతో పాటు ఇతర కార్యక్రమాలనూ అనుసంధానించి పల్లె పండగ 2.0ని ఇటీవల ప్రారంభించారు. ఇందులో 10,000 కి.మీ. రహదారుల పనులు చేపడుతున్నారు. మరో 5,000 కి.మీ. పనులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించనున్నారు. 2028 మార్చి నాటికి అన్ని గ్రామాల్లో రహదారులు మెరుగుపరచాలని ప్రభుత్వం భావిస్తోంది.

# అయోమయంలో మిర్చి రైతు.. ధర పెరిగిన దిగుబడి లేదు



**గుంటూరు, పతాకం న్యూస్:** ఉమ్మడి గుంటూరు జిల్లాలో మిర్చి సాగు చేసిన రైతులు తీవ్ర అయోమయంలో చిక్కుకున్నారు. మార్కెట్‌లో ధరలు పెరిగాయని సంతోషపడాలో... తమకు దిగుబడి రాలేదని బాధ పడాలో తెలియని పరిస్థితుల్లో రైతులున్నారు. గుంటూరులో సాధారణ రకం మిర్చికి గరిష్ట ధర క్వింటాల్‌కు రూ.25 వేలు లభించింది. ఇటీవల కాలంలో ఇంత ధర రావడం రైతులను ఆశ్చర్యానికి గురి చేసింది. గతేడాది కనీసం రూ.15 వేలు కూడా దాటని ధర ఈ ఏడాది రూ.25 వేలకుపైగా పలుకుతుందని ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న సమాచారం రైతులను ఆవేదనకు గురి చేస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా 1.65 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగు చేయాల్సి ఉండగా ఈ ఏడాది పల్నాడు జిల్లాలో 1.10 లక్షల ఎకరాలు, గుంటూరు జిల్లాలో 25 వేల ఎకరాలు మాత్రమే సాగు చేశారు. దాదాపు 30 వేల ఎకరాల్లో మిర్చి సాగు తగ్గింది. విస్తీర్ణం తగ్గడంతో పాటు ఖరీఫ్‌లో సాగు చేసిన మిర్చి పైరును ఆగస్టు నుంచి అక్టోబరు వరకు కురిసిన అధిక వర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి. కొన్ని ప్రాంతాల్లో మొంథా తుపాను బాగా దెబ్బతీసినా అధికారులు చాలాచోట్ల నమోదు చేయలేదు. నమోదు చేసినా ఇప్పటికీ పరిహారం రాలేదు. దీంతో ధర పెరిగినా దిగుబడి రాకపోవడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. అంతేగాకుండా ఈ ఏడాది ఆదిలోనే మిర్చికి నల్లతామర, జెమినీ వైరస్? తెగుళ్లు సోకడం వల్ల కొన్ని ప్రాంతాల్లో పైర్లు మనుగడ సాధించలేకపోయాయి. నవంబరులోనే ప్రత్తిపాడు ప్రాంతంలో మిర్చి పైరు దున్నేసిన పరిస్థితులు లేకపోలేదు. ప్రధానంగా గుంటూరు జిల్లాలోని తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాలు, పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో దాదాపు 55 వేల ఎకరాల్లో సగటు దిగుబడి గరిష్టంగా 5 క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. అక్టోబరు తరువాత సాగు చేసిన ప్రాంతాల్లో మాత్రం మరో 55 వేల ఎకరాల్లో పైరు పరిస్థితి బాగానే ఉందని చెబుతున్నారు. తాజాగా గుంటూరు మిర్చి యార్డు మంగళవారం ప్రకాశం, రాయలసీమ, ఎన్‌టిఆర్, ఖమ్మం జిల్లాల నుంచి భారీగా మిర్చి సరుకు వచ్చింది. గుంటూరు మిర్చి యార్డుకు 80,039 టిక్కీలు వచ్చాయి. పాత నిల్వలతో కలిపి 77,055 టిక్కీలు అమ్ముడుపోయాయి. ఇంకా 15,241 టిక్కీలు నిల్వ ఉన్నాయి. విస్తీర్ణం, దిగుబడి రెండూ తగ్గడం వల్ల వ్యాపారులు ముందస్తుగా వచ్చిన నాణ్యమైన సరుకును కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలోనే నాన్ ఎసి దేవనూరు డీలక్స్, 341 రకం గరిష్ట ధర రూ.25 వేలు పలికి రికార్డు సృష్టించింది. నాన్ ఎసి కామన్ వెరయిటీల్లో గరిష్ట ధర క్వింటాల్ రూ.22 వేలు, కనిష్ట ధర రూ.13,500 గత కొన్ని రోజులుగా కొనసాగుతోంది. తేజ, బాడిగ వెరైటీ ధరలు భారీగా పెరిగాయి. స్పెషల్ వెరరైటీల్లో బాడిగ 355 రకం గరిష్ట ధర రూ.23,500 పలికింది. ఎసి వెరైటీల్లో 334 రకం కనిష్ట ధర రూ.13,500, గరిష్ట ధర రూ.22 వేలు కొనసాగింది. ఎసి స్పెషల్? వెరైటీల్లో తేజ రూ.13,500 కనిష్ట ధర కాగా గరిష్ట ధర రూ.20 వేలు బాడిగ రూ.13,500, గరిష్టంగా రూ.21,500 పలికింది.

## తాగునీటి కోసం మహిళల ఆందోళన

**కవిటి, పతాకం న్యూస్:** మా గ్రామంలో తాగునీటి కోసం రోజుల తరబడి ఇబ్బందులు పడు తున్నామని తీరప్రాంత గ్రామమైన కొత్తపాలేనికి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కొత్తపాలెం గ్రామానికి కొద్దిరోజులుగా తాగునీరు సరఫరా సక్రమంగా ఇవ్వడం లేదని, దీంతో తీవ్ర ఇక్కట్లకు గురయ్యామని వాపోయారు. ఎప్పుడు నీరు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమస్యను గతంలో ఎమ్మెల్యే బి.అశోక్ దృష్టికి తీసుకువెళ్లగా పాఠశాల ఆవరణలో వాటర్ ట్యాంకు ఏర్పాటు చేశారన్నారు. కానీ ఆ ట్యాంకులోకి నీరు ఎప్పు డు వస్తుందో తెలియడం లేదన్నారు. ప్రస్తు తం కొద్ది రోజులుగా ఆ నీరు ట్యాంకుకు రాక పోవడంతో తాగునీటికై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. అనంతరం కార్యాలయ ఏవో కె.శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. దీంతో ఆయన స్పందించి గ్రామాన్ని సందర్శించి తాగునీటి సరఫరా పరిస్థితిని పరిశీలించారు. ఆ వెంటనే ట్యాంకుల ద్వారా గ్రామస్థులకు తాగునీటిని అందించారు.



# గుండెపోటు రావడానికి గల కారణాలు?

గుండె మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. ఇది శరీరంలో ఛాతీ, ఊపిరితిత్తుల మధ్య ఉంటుంది. గుండె ఆక్సిజన్, పోషకాలని రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకి సరఫరా చేస్తుంది. అయితే మారిన జీవనశైలి మరియు ఆహార అలవాట్ల వల్ల ప్రస్తుతం వయస్సు మరియు లింగ భేదంతో సంబంధం లేకుండా చాలా మందిలో గుండె సంబంధిత సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ప్రతిరోజు వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉన్న యువతలో కూడా అకస్మాత్తుగా గుండెపోటు రావడం ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్న విషయం. గుండెలోని రక్తనాళాల్లో బ్లాక్‌లు (పూడికలు) వల్ల రక్త ప్రసరణకు అవరోధం ఏర్పడుతుంది. ఈ కారణంగా రక్తాన్ని గుండె సరిగా సరఫరా చేయలేకపోతుంది, దీని ఫలితంగా గుండెపోటు (హార్ట్ ఎటాక్) వస్తుంది.



### గుండెపోటు రావడానికి గల కారణాలు

అస్తవ్యస్తమైన జీవన విధానం మరియు ఆహారపు అలవాట్లు గుండెపోటుకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. వీటితో పాటు: మధుమేహం, అధిక రక్తపోటు, అధిక బరువు (ఒబెసిటీ)ను కలిగి ఉండడం, శారీరక శ్రమ, వ్యాయామం చేయకపోవడం, వృత్తిపరమైన మరియు వ్యక్తిగత ఒత్తిడి, ధూమపానం మరియు మద్యం సేవించడం, అధిక కొవ్వు పదార్థాలు మరియు మైదాతో చేసిన ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం.

గుండె దగ్గర వచ్చే నొప్పి అలాగే గ్యాస్ట్రిక్ సమస్య వల్ల వచ్చే నొప్పి దాదాపు ఒకేలా ఉంటాయి. దీంతో చాలా మంది గ్యాస్ట్రిక్ సమస్యతో నొప్పి వచ్చినా అది గుండె నొప్పి ఏమో అని చాలా కంగారు పడుతుంటారు. వీటి గురించి తెలుసుకోవడం అవసరం.

గ్యాస్ట్రిక్ సమస్య సాధారణంగా ఆహారం తీసుకున్న తర్వాత వస్తుంది. గ్యాస్ట్రిక్ సమస్య ఉన్నవారిలో పొట్ట మరియు ఛాతీలో నొప్పి వస్తుంది. ఆ నొప్పి వెన్నెముక వైపుగా వ్యాపిస్తుంది

గొంతులో మంట. కడుపు మరియు ఛాతీ భాగంలో మండినట్లుగా ఉంటుంది. తేన్పులు రావడం

### గుండెపోటు లక్షణాలు

గుండెపోటు లక్షణాల్లో గ్యాస్ట్రిక్ లక్షణాలతో పాటు.. గుండెలో ఆకస్మికంగా నొప్పి రావడమే కాక, తీవ్రమైన నొప్పి మెడ వరకూ పాకుతుంది.

ఆకస్మిక మైకము, వికారం. శరీరం అంతా చెమటలు పట్టి చల్లగా అయిపోతుంది. ఊపిరి తీసుకోవడానికి కూడా చాలా ఇబ్బంది పడుతుంటారు.

ఛాతీలో నొప్పి ప్రారంభమై ఎడమ చేతి, ఎడమ దవడ మరియు కుడి చేతి వరకూ కూడా ఈ నొప్పి వ్యాపిస్తుంది

నడిచేటప్పుడు ఛాతీలో నొప్పి మరియు అసౌకర్యం కలిగినా దానిని గుండెపోటు లక్షణంగా పరిగణించవచ్చు. గుండె సంబంధిత సమస్యలు ఉంటే గుండె సాధారణం కంటే ఎక్కువగా కొట్టుకుంటుంది

### గుండెపోటు యొక్క నివారణ చర్యలు

మధుమేహం మరియు కొలెస్ట్రాల్ నియంత్రణలో పెట్టుకోవాలి (డయాబెటిస్ మరియు అధిక కొవ్వు గల వ్యక్తులకు గుండెపోటు మరియు స్ట్రోక్ వచ్చే ప్రమాదం 2-3 రెట్లు ఎక్కువ). ధూమపానం మానేయాలి (గుండెపోటుకు ప్రధాన కారణమైన ధూమపానం మానేస్తే బీపీ మరియు గుండె సంబంధ వ్యాధులు దరిచేరవు). శారీరక శ్రమ మరియు వ్యాయామం తప్పనిసరి (రోజుకూ 30 నిమిషాలు లేదా వారంలో కనీసం 150 నిమిషాలు వ్యాయామం చేయడం వల్ల గుండె ఆరోగ్యం, పనితీరు పెరిగి గుండె ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చు). ప్రతి రోజూ ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు నట్స్ మరియు డ్రై ఫ్రూట్స్, మొలకలు వంటి వాటిని తీసుకుంటూ ఉండాలి (ఇందులో కొవ్వు తక్కువగా మరియు విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి). ఫాస్ట్ ఫుడ్, శీతల పానీయాలు మరియు కేలరీలు ఎక్కువగా, పోషకాహారం తక్కువ వంటి వాటిని పరిమితంగా తీసుకోవడం మంచిది. వృత్తిపరమైన మరియు వ్యక్తిగత ఒత్తిళ్లు మరియు అధికంగా ఆలోచనలు చేయడం మానేయాలి . రోజులో కనీసం 7-8 గంటల పాటు నిద్రించడం వల్ల గుండె పోటు వచ్చే ముప్పును తగ్గించుకోవచ్చు. వేరుశెనగ నూనె, కొబ్బరి నూనెలను తగిన మోతాదులో తీసుకోవాలి

రెడ్ మీట్ (బీఫ్, పోర్క్, మటన్) వంటి వాటిని ఎక్కువగా తీసుకోకూడదు. అయితే సాధారణంగా 30% పైగా గుండెపోటులు ఈసీజీ పరీక్షల ద్వారానే నిర్ధారిస్తారు.

**ల్యాబ్ పరీక్షలు:** లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్, సి-రియాక్టివ్ ప్రోటీన్ పరీక్ష, కార్డియాక్ ట్రోపోనిన్‌లు క్రియేటిన్ కినేస్, మయోగ్లోబిన్.

**ఇమేజింగ్ పరీక్షలు:** ఎలక్ట్రో కార్డియోగ్రామ్ , అంబులేటరీ, ఎకోకార్డియోగ్రఫీ, కరోటిడ్ అల్ట్రాసౌండ్, కార్డియాక్ , కరోనరీ యాంజియోగ్రఫీ, కార్డియాక్ కాథెటరైజేషన్, ట్రాన్సోఫేజియల్ ఎకోకార్డియోగ్రఫీఅలాగే ప్రతి సంవత్సరం అనే పరీక్షను చేయించుకోవడం కూడా మంచిది. పై నియమాలను పాటించడం వల్ల గుండె జబ్బుల బారిన పడకుండా చాలా వరకు నివారించుకోవడమే కాకుండా ఆరోగ్యకరమైన మరియు సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చు.



# ఆముదాన్ని ఇలా రాస్తే జుట్టు ఒత్తుగా, పొడుగ్గా పెరుగుతుంది..



జుట్టు పెరగాలని చాలా మంది ఆముదం రాస్తుంటారు. అయినా రిజల్ట్ ఉండదు. దీనికి కొన్ని కారణాలు ఉంటాయి. సరైన విధానంలో ఆముదాన్ని అప్లై చేయాలి. అదెలానో తెలుసుకుందాం.

ఆముదాన్ని నేరుగా జుట్టుకి అప్లై చేయొద్దు. ఎందుకంటే ఇది చాలా మందంగా ఉంటుంది. దీంతో కుదుళ్ళకి నూనె చేరదు. దీంతో ఆముదంలోని గుణాలు చేరవు. అందుకే, దీనిని కొబ్బరినూనె, జొజొబా ఆయిల్ వంటి లైట్ ఆయిల్స్‌తో కలిపి అప్లై చేయాలి.

చాలా మంది నూనె రాసేటప్పుడు చేసే పొరపాటు ఏంటంటే.. కుదుళ్ళకు రాయరు. కేవలం జుట్టుకి రాస్తారు. కానీ, జుట్టుకి రాసినా రాయకపోయినా కచ్చితంగా కుదుళ్ళకి రాయాలి. అప్పుడే మూలాలు బలంగా పెరుగుతాయి. తలకి రక్త ప్రసరణ పెరుగుతుంది.

అదే విధంగా నూనె రాసిన తర్వాత రాత్రంతా అలానే ఉంచాలా.. గంటసేపు ఉంటే సరిపోతుందా అనే సందేహం కూడా చాలా మందికి ఉంటుంది. కానీ, నిజానికి ఇది మన శరీర తత్వాన్ని బట్టి ఉంటుంది. రక్తప్రసరణ పెంచడం అందరికీ ఒకేలా ఉండదు. ఇది అందరికీ భిన్నంగా ఉంటుంది. మీ వీలుని బట్టి మీరు దీనిని చూస్ చేసుకోవచ్చు.

రోజూ నూనె రాయడం వల్ల జుట్టు త్వరగా పెరుగుతుందని అనుకుంటారు. కానీ, ఇది నిజం కాదు. దీని వల్ల తలపై మురికి పేరుకుపోతుంది. ముఖ్యంగా ఆముదాన్ని అసలే రాయొద్దు. వారానికి ఒకటి, రెండు సార్లు సరిపోతుంది.

కొంతమందికి ఆముదం రాస్తే మంటగా ఉంటుంది. ఆ సమస్య ఉందో లేదో చెక్ చేసుకోండి. చెవి వెనుక కొద్దిగా రాసి అలానే ఉంచండి. చిరాకు, దురదగా అనిపిస్తే రాయొద్దు. జుట్టు రాసిన తర్వాత కచ్చితంగా వేళ్ళతో మసాజ్ చేయాలి. ఈ విషయాన్ని కచ్చితంగా గుర్తుపెట్టుకోండి. అదే విధంగా, జుట్టు రాసిన వెంటనే జుట్టు పెరుగుతుందనుకోవద్దు. దీంతో పాటు కొంతమందికి త్వరగా జుట్టు పెరుగుతుంది. మరికొంతమందికి టైమ పడుతుంది. కాబట్టి, ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోండి.

# నత్తనడకన సీతంపేట మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం



**విజయనగరం, పతాకం న్యూస్:** సీతంపేటలో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు కొలిక్కి రావడం లేదు. సుమారు ఐదేళ్లు గడుస్తున్నా.. నేటికీ నత్తనడకనే సాగుతున్నాయి. బిల్లులు చెల్లింపులవుతున్నా ఈ పరిస్థితి నెలకొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఎప్పుడెప్పుడు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఎదురుచూస్తున్న గిరిజనులకు నిరాశే మిగులుతుంది. అసలు ఆసుపత్రి పనులు ప్రారంభమైన నాటి నుంచి పనుల్లో ఆశించిన వేగం కనిపించడం లేదని గిరిజన సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. పనులు పూర్తి చేయడంలో ఇంకెన్నాళ్లు కాలయాపన చేస్తారని ప్రశ్నిస్తున్నారు. గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం సీతంపేట కేంద్రంగా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని మంజూరు చేసింది. దీని కోసం రూ.49.26కోట్లు మంజూరు చేసింది. అప్పట్లో ఎన్‌సీసీ(నాగార్జున కనస్ట్రక్షన్స్ కంపెనీ)సంస్థ నిర్మాణ బాధ్యతలను దక్కించుకుని పనులు ప్రారంభించింది. నిబంధనల మేరకు 2024, సెప్టెంబరు నాటికి భవన పనులు పూర్తిచేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు 70శాతం మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 30శాతం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికే ఒకసారి సంబంధిత ఎన్‌సీసీ కంపెనీ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం గడువు పెంచింది. 2025, సెప్టెంబరు వరకు అవకాశం ఇచ్చింది. గడువు దాటి సుమారు 4నెలలు కావస్తున్నప్పటికీ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తి చేసేందుకు మరోసారి నిర్మాణ సంస్థ గడువు పెంచాలని ఏపీఎంఐడీసీ(ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)కు అభ్యర్థించినట్లు తెలుస్తోంది. 2026 అక్టోబరు వరకు గడువు పెంచాలని కోరినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంబంధిత ఎన్‌సీసీ సంస్థకు సుమారు 90శాతానికి పైబడి అంటే రూ.27కోట్ల వరకు బిల్లులు చెల్లించింది. ఇటీవల చేపట్టిన పనులకు సంబంధించి రూ.కోటి వరకు మాత్రమే నిర్మాణ సంస్థకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. కాగా ఆసుపత్రిలో ఇంకా మినీ విద్యుత్ సబ్‌స్టేషన్ , రహదారులు, డ్రైన్‌లు, పెయింటింగ్స్ తదితర పనులు పూర్తిచేయాల్సి ఉంది. మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులపై సంబంధిత ఏపీఎంఐడీసీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణాన్ని మొదట ఎన్‌సీసీ ప్రారంభించినా.. ఆ తరువాత ఆ పనులను సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు తెలుస్తోంది. దీంతో పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## 25 కోట్లమందిని పేదరికం నుంచి విముక్తి కల్పించాం : బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రపతి



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పేదల కోసం 4 కోట్ల ఇళ్లు నిర్మించామని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. గత పదేళ్లలో 25 కోట్లమందిని పేదరికం నుంచి విముక్తి కల్పించామని చెప్పారు. ఇంకా 100 కోట్లకుపైగా గ్యాస్ కనెక్షన్లు అందించామని వెల్లడించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకుందని ప్రస్తావించిన రాష్ట్రపతి, బిర్సాముండా, సర్దాం? పటేల్‌కు నివాళులు అర్పించారు. వీరితో పాటు భారతరత్న భూపేన్ హజారికా శతజయంతి సందర్భంగా స్మరించారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం అందరికీ అందాలని అంబేద్కర్ ఆకాంక్షించారని గుర్తు చేశారు. వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు విస్తరించామని, ప్రస్తుతం దేశంలో 150కిపైగా వందేభారత్ రైళ్లు ఉన్నాయని తెలిపారు. భారత్ తన సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేసుకోబోతోందని వెల్లడించారు. "వరి ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో నిలిచింది. తయారీ రంగంలోనూ మంచి ప్రగతి నమోదవుతోంది. స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లోనూ భారత్ దూసుకెళ్తోంది. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. సామాజిక న్యాయసాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. నగదు బదిలీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా డబ్బు జమ. ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్లమందికి వైద్యసేవలు అందిస్తున్నాం. సికిల్ సెల్ వంటి వ్యాధులపై పోరాటం సాగిస్తున్నాం. కరోనా తర్వాత బీమాపై ప్రజల్లో అవగాహన పెరిగింది. వికసిత్ భారత్‌లో రైతులు, మహిళలు, యువతది కీలకపాత్ర. జల్‌జీవన్ మిషన్ ద్వారా కోట్లమందికి తాగునీరు అందిస్తున్నాం. దేశంలో స్పేస్ టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని రాష్ట్రపతి తెలిపారు. ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడంపై దేశప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పన్ను సంస్కరణలు రూపొందుతున్నాయన్నారు. దేశం పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతోందని, దేశ అణువిద్యుత్ సామర్థ్యం క్రమంగా పెరుగుతోందన్నారు. అవినీతి కట్టడి ద్వారా ప్రభుత్వం ప్రజాధనాన్ని సద్వినియోగం చేస్తోందని చెప్పారు.




### న్యూజిలాండ్‌తో జరిగే నాలుగో టీ20లో

# టీమిండియా జోరు కొనసాగించేనా?



హ్యాట్రిక్ విజయాలతో ఇప్పటికే భారత జట్టు ఐదు టీ20ల సిరీస్‌ను ఖాతాలో వేసుకుంది. ఇక బుధవారం విశాఖ తీరాన జరిగే నాలుగో టీ20లోనూ అదే జోష్‌ను ప్రదర్శించాలన్న పట్టుదలతో ఉంది. బ్యాటింగ్ భీకరంగా సాగుతున్నా స్పిన్నర్ల నుంచి కూడా చక్కటి ప్రదర్శనను భారత జట్టు మేనేజ్‌మెంట్? కోరుకుంటోంది. అటు పర్యాటక న్యూజిలాండ్ పరిస్థితి దీనంగా కనిపిస్తోంది. ఎంత భారీ స్కోరు చేసినా కళ్లు చెదిరే హిట్టింగ్‌తో భారత బ్యాటర్లు ఉఫ్‌మని ఊది పారేస్తుండడంతో ఆ జట్టు అయోమయంలో పడుతోంది. ఎలాగైనా నేటి మ్యాచ్‌లో భారత్‌ను కట్టడి చేయడంతో పాటు ఓ విజయాన్ని ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. బ్యాటింగ్‌లో ఫిలిప్స్, శాంట్నర్ మాత్రమే రాణిస్తున్నారు. ఇక పేసర్ జేమిసన, డఫీ స్థానాల్లో ఫెర్గూసన్, నీషమ్ ఆడనున్నారు.

భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో ఓపెనర్ సంజూ శాంసన్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. టీ20 వరల్డ్‌కప్ జట్టులో ఇషాన్‌ను తీసుకుంటే సంజూకు బ్యాకప్ కీపర్‌గా భావించారు. కానీ ప్రస్తుతం సీన్ రివర్స్ అయ్యేలా ఉంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో శాంసన్ చేసింది 16 పరుగులే కాగా.. అటు ఇషాన్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపిస్తూదుమ్మురేపుతున్నాడు. ఈ నేపథ్యంలో తిలక్ చివరి రెండు మ్యాచ్‌లకు కూడా దూరం కావడంతో శాంసన్‌కు మరో చాన్స్ దక్కడం ఖాయమే. ఇక టీ20 వరల్డ్ కప్ తుది జట్టులో తన పేరును పరిగణనలోకి తీసుకోవాలంటే ఈ చివరి రెండు మ్యాచ్‌ల్లో శాంసన్ నిరూపించుకోవాల్సిందే. ఇక అభిషేక్, సూర్య ఫామ్‌తో కివీస్ బౌలర్లు బంతులు వేసేందుకే భయపడుతున్నారు. కానీ స్పిన్నర్ కుల్దీప్ పరుగులు ఎక్కువగా ఇస్తుండడం ఆందోళనకరం. అటు మూడో టీ20లో ఆడిన రవి బిష్ణోయ్ రెండు వికెట్లతో ఆకట్టుకున్నాడు. దీంతో నేటి మ్యాచ్‌లో ఈ ఇద్దరిలో ఎవరిని కొనసాగిస్తారనేది ఆసక్తికరంగా మారింది. రొటేషన్‌లో భాగంగా అర్ష్‌దీప్, వరుణ్ జట్టులోకి రానున్నారు.

భారత్: సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, దూబే, రింకూ, హర్షిత్ రాణా, కుల్దీప్/రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, వరుణ్.

న్యూజిలాండ్: సీఫర్ట్, కాన్వే, రచిన్, ఫిలిప్స్, డారిల్ మిచెల్, చాప్‌మన్, నీషమ్, శాంట్నర్ (కెప్టెన్), హెన్రీ, ఫెర్గూసన్, సోఢీ.

## టీ20 ర్యాంకింగ్స్.. నెం.1 స్థానంలో అభిషేక్ శర్మ



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) బుధవారం టీ20 ర్యాంకింగ్స్ ను ప్రకటించింది. తాజాగా ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తాచాటారు. ముఖ్యంగా బ్యాటర్లు భారీగా తమ ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. న్యూజిలాండ్ టీ20 సిరీస్‌లో తొలి మూడు టీ20ల్లో అద్భుత ప్రదర్శనలు చేసిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఏకంగా ఐదు స్థానాలు మెరుగుపర్చుకొని 12వ స్థానం నుంచి ఏకంగా 7వ స్థానంలోకి దూసుకొచ్చాడు. ప్రస్తుతం సూర్య 717 రేటింగ్ పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచాడు.

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ చాలా కాలం నుంచి అగ్రస్థానంలోనే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ర్యాంకింగ్స్‌లో తన రేటింగ్ పాయింట్లను మరింత పెంచుకున్నాడు. ప్రస్తుతం 929 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మిగతా భారత బ్యాటర్ల విషయానికి వస్తే స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా 53, శివమ్ దూబే 59, రింకూ సింగ్ 68 స్థానాల్లో ఉన్నారు. గాయం కారణంగా న్యూజిలాండ్ సిరీస్‌కు దూరంగా ఉన్నా తిలక్ వర్మ తన మూడో స్థానాన్ని కాపాడుకున్నాడు. ఇక భారత బౌలర్ల విషయానికి వస్తే వరుణ్ చక్రవర్తి టాప్ ప్లేసులోనే కొనసాగుతున్నాడు. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా 4 స్థానాలు ఎగబాకి 13కు, రవి బిష్ణోయ్ 13 స్థానాలు ఎగబాకి 19కి, హార్దిక్ పాండ్యా 18 స్థానాలు ఎగబాకి 59వ స్థానానికి చేరారు. మిగతా భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్ 16, కుల్దీప్ యాదవ్ 25 స్థానాల్లో కొనసాగుతున్నారు. ఇక ఆల్‌రౌండర్ల విషయానికొస్తే.. భారత ఆటగాళ్లు హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే ఒకటి, 6 స్థానాలు మెరుగుపర్చుకొని 3, 12 స్థానాలకు ఎగబాకారు. సికందర్ రజా, సైమ్ అయూబ్ టాప్-2 ప్లేసుల్లో కొనసాగుతున్నారు.




# ప్రేమలు, బ్రేకప్స్ గురించి ఎమోషనల్‌గా స్పందించిన తమన్నా



మిల్కీ బ్యూటీ తమన్నా గత రెండు దశాబ్దాలుగా స్టార్ హీరోయిన్‌గా రాణిస్తోంది. ప్రస్తుతం ఐటెం సాంగులతో కూడా దూసుకుపోతోంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, ఆమె వ్యక్తిగత జీవితం మాత్రం ఎప్పుడూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గానే ఉంది. ముఖ్యంగా నటుడు విజయ్ వర్మతో సాగిన ప్రేమాయణం, ఆ తర్వాత జరిగిన బ్రేకప్ అందరికీ తెలిసిందే. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తమన్నా తన ప్రేమలు, బ్రేకప్స్ గురించి ఎమోషనల్‌గా స్పందించింది.

ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ, “నేను టీనేజ్?లో ఉన్నప్పుడే మొదటిసారి ప్రేమలో పడ్డాను. కానీ నా లక్ష్యాలు, కెరీర్ కోసం ఆ బంధాన్ని వదులుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మరో వ్యక్తితో రిలేషన్?లో ఉన్నాను. కానీ కొన్నాళ్లకే ఆ వ్యక్తి నాకు సరైన జోడీ కాదనిపించింది. అలాం టి వ్యక్తితో బంధాన్ని కొనసా గించడం చాలా ప్రమాద కరమని గ్రహించి బయటపడ్డాను” అని తెలిపింది. ఆమె ఈ వ్యాఖ్యలు విన్నవా రంతా “ఆ డేం జర్ పర్సన్ ఎవరు? విజయ్ వర్మ నేనా?” అని ఆరా తీస్తున్నారు.

తమన్నా-విజయ్ వర్మ ప్రేమాయణం ‘లస్ట్ స్టోరీస్ 2’ సిరీస్ సెట్స్‌లో మొదలైంది. లివ్ లాక్, ఇంటిమేట్ సీన్స్‌లో వారు రెచ్చిపోవడంతో బీటౌన్ మీడియా రచ్చ చేసింది. ఆ తర్వాత ఏ ఈవెంట్‌కు వెళ్లినా కలిసే కనిపించడం, కలిసి ఫొటో షూట్లు చేయడం చూసి అందరూ త్వరలో పెళ్లి చేసుకుంటారని భావించారు. కానీ ఆకస్మికంగా వీరిద్దరూ విడిపోయారు. తమన్నా పెళ్లికి సిద్ధమవుతుంటే, విజయ్ మాత్రం కెరీర్‌కే ప్రాధాన్యత ఇచ్చాడని బీటౌన్ టాక్. ఈ మధ్యలో వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయని అంటున్నారు. తమన్నా ఇప్పుడు “ప్రేమ కంటే ఆత్మగౌరవం, కెరీర్ ముఖ్యం” అని స్పష్టంగా చెప్పడం అందరినీ ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో “తమన్నా బోల్డ్ డెసిషన్”, “ఆమె లాంటి హీరోయిన్లు ఉంటేనే స్ఫూర్తి”, “డేంజర్ అని చెప్పిన వ్యక్తి ఎవరో బయటపడాలి” అంటూ ట్వీట్స్ వెల్లువెత్తుతున్నాయి. కొందరు “విజయ్ వర్మతోనే బ్రేకప్ అని స్పష్టంగా చెప్పేసింది” అని కామెంట్ చేస్తున్నారు.

# అల్లు అర్జున్ సినిమాలో దీపికా పదుకొణె



స్టార్ హీరో అల్లు అర్జున్ హీరోగా కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ సైన్స్ ఫిక్షన్ మూవీ ‘ఏఏ 22’ పై ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పుడు ఈ చిత్రంపై అట్లీ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హీరోయిన్ దీపికా పదుకొణె తనకు లక్కీ ఛార్మ్ అని, ఆమె ఈ సినిమాలో చాలా కొత్తగా కనిపిస్తారని, ఆమె నటన అందరినీ కట్టిపడేస్తుందని ఆయన చెప్పారు.

ఒక మీడియా సంస్థతో అట్లీ మాట్లాడుతూ, “దీపిక నా లక్కీ ఛార్మ్. ఆమె ఈ సినిమాలో చాలా ఫ్రెష్‌గా, కొత్తగా కనిపిస్తారు. ఆమె నటన అద్భుతంగా ఉంటుంది” అని అన్నారు. షారుఖ్ ఖాన్- దీపికలతో అట్లీ తెరకెక్కించిన ‘జవాన్’ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

ఇక ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ మరో తమిళ దర్శ కుడితో కలిసి పనిచే యనున్నారు. ‘ఖైదీ’, ‘విక్రమ్’లతో థ్రిల్ పంచిన లోకేశ్ కన గరాజ్ దర్శకత్వంలో బన్నీ నటించ నున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు బన్నీ కెరీర్‌లో కీలక మైనవిగా నిలుస్తాయని అభి మా నులు ధీమా వ్య క్తం చేస్తున్నారు.




# ధర్మా ప్రొడక్షన్స్ నుంచి బయటకు వచ్చేసిన జాన్వీ కపూర్



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ తీసుకున్న ఒక నిర్ణయం ఇండస్ట్రీని షాక్‌కి గురిచేస్తోంది. తనను ఇండస్ట్రీకి పరిచయం చేసి, వెన్నంటి నిలిచిన స్టార్ ప్రొడ్యూసర్ కరణ్ జోహార్‌కు ఆమె షాకిచ్చింది. ఆయనకు చెందిన ‘ధర్మా ప్రొడక్షన్స్’ టాలెంట్ మేనేజ్‌మెంట్ నుంచి బయటకు వచ్చేసింది. ఇకపై సొంతంగా తన కెరీర్ నిర్ణయాలు తీసుకుంటానని జాన్వీ ఫిక్స్ అయ్యింది.

ఇన్నాళ్లూ ఏ సినిమా చేయాలి, ఏ బ్రాండ్‌కు ప్రచారం చేయాలి అన్నదంతా కరణ్ జోహార్ కనుసన్నల్లోనే జరిగేవి. దీంతో ఆమెపై ‘నెపో కిడ్’ ముద్ర బలంగా పడింది. ఆ విమర్శల నుంచి బయటపడటానికే జాన్వీ ఇప్పుడు ‘కలెక్టివ్ ఆర్టిస్ట్ నెట్?వర్క్’ అనే కొత్త సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. తల్లి శ్రీదేవి లాగే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని స్టార్‌డమ్ సంపాదించాలని ఆమె గట్టిగా నిశ్చయించుకుంది

ప్రస్తుతం జాన్వీ ఫోకస్ మొత్తం సౌత్ సినిమాలపైనే ఉంది. ‘దేవర’తో భారీ విజయం సాధించిన ఆమె, ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన ‘పెద్ది’లో నటిస్తోంది. అంతేకాదు, అల్లు అర్జున్-అట్లీ కాంబినేషన్‌లో రాబోయే భారీ ప్రాజెక్ట్‌లోనూ జాన్వీ పేరు దాదాపు ఖరారైనట్లు సమాచారం. బాలీవుడ్ మేనేజ్‌మెంట్‌కు గుడ్‌బై చెప్పి, సౌత్ ప్యాన్-ఇండియా ప్రాజెక్టులతో కెరీర్ గ్రాఫ్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లాలని జాన్వీ వేస్తున్న స్కెచ్ చూసి ఇండస్ట్రీలో అంతా షాక్ అవుతోంది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**